జాతీయ దినపత్రిక
Postail Licence No. L/KNL/3-52(D) 2018 - 2020
# ఉదయం న్యూస్
ఎడిటర్ : సి. శేఖర్ యం
Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi
సంపుటి :03 సంచిక :342 పేజీలు 8 వెల : 5 ఆదివారం 31 ఆగష్టు 2025

జాతీయ దినపత్రిక
ఉదయం న్యూస్
ఎడిటర్ : సి. శేఖర్ యం
వాస్తవాల్లే వార్తలుగా వ్రాసే సత్తా ఉన్న దినపత్రిక




వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...
9వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా !.. ఉదయం దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.
వాస్తవాలే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్నా విషయం మీకందరికీ తెలిసిందే.
పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....
మీ... ఉదయం దినపత్రిక ఎడిటర్

తారీఫ్
బ్యాక్ కవర్ పేజి మల్టీకలర్ : 50,000/-
ఇన్నర్ మల్టీకలర్ పేజి : 20,000/-
ఫ్రంట్ మల్టీకలర్ పేజి : 70,000/-
బ్లాక్ & వైట్ పేజి
బ్యాక్ పేజి : 20,000/-
ఇన్నర్ పేజి : 20,000/-
ఫ్రంట్ పేజి : 30,000/-

ప్రకటనదారులకు విజ్ఞప్తి...
గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉదయం తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.




# రాయలసీమను రతనాల సీమగా మారుస్తా

## ప్రతి చెరువును నీటితో నింపే ప్రయత్నం చేస్తా

## అభివృద్ధిని అడ్డుకుంటున్న వైకాపాకు అడ్డుకట్ట వేస్తాం

## పరమసముద్రం సభలో చంద్రబాబునాయుడు

కుప్పం:రాయలసీమను రతనాలసీమగా చేసే బాధ్యత తనదని ముందే చెప్పానని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రతి చెరువుకు నీళ్లిచ్చే బాధ్యత నాది. పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో 110 చెరువులకు నీళ్లిచ్చే అవకాశం ఉంది. కుప్పంలో 520 చెరువులు ఉన్నాయి. గొలుసుకట్టు- చెరువులు ఉన్నాయి. చెక్‌డ్యామ్‌ల ద్వారా నీళ్లిచ్చే అవకాశం ఉంది. కృష్ణా జలాలను 730 కిలోమీటర్లు తీసుకొచ్చిన ఘనత తెదేపాది. ముఠా రాజకీయాలు లేకుండా చేసిన పార్టీ తెదేపా. హంద్రీనీవా ఫేజ్-1, ఫేజ్-2 వల్ల 6 లక్షల ఎకరాలకు సాగునీరు వస్తుంది. 33 లక్షల మందికి తాగునీరు అందుబాటు-లో ఉంటు-ంది. పరిశ్రమలకు కూడా నీళ్లొస్తాయి. ఇప్పుడు కుప్పానికి నీళ్లొచ్చాయి. రాబోయే ఏడాదికి హంద్రీనీవా ద్వారా చిత్తూరుకు కూడా నీళ్లిచ్చే బాధ్యత నాది. రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీళ్లివ్వగలిగితే నా జన్మ సార్థకమవుతుందన్నారు. 2014-2019 మధ్య కాలంలో రాయలసీమ ప్రాజెక్టు కోసం రూ.12,500 కోట్లు- ఖర్చు పెట్టినట్లు చెప్పారు. కానీ, వైకాపా పాలనలో కేవలం రూ.2 వేల కోట్లు- ఖర్చుపెట్టారని విమర్శించారు. కుప్పం నియోజకవర్గంలో పర్యటించిన ఆయన.. పరమసముద్రం వద్ద కృష్ణమ్మకు జలహారతి ఇచ్చారు. అనంతరం ఏర్పాటు- చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. గేట్లతో సెట్టింగ్‌లు వేసి నీళ్లు కూడా బయటి నుంచి తీసుకొచ్చి నాటకాలాడిన ఘటనలు చూశాం. విమానం ఎక్కేలోపే నీళ్లన్నీ ఇంకిపోయిన పరిస్థితులు చూశాం. అసత్యాలు చెప్పడంలో వైకాపా దిట్ట. అసాధ్యాలను సుసాధ్యం చేయడం ఎన్డీయే లక్ష్యం అన్నారు. నీళ్లు వచ్చేసరికి వైకాపా నేతలు జీర్ణించుకోలేక పోతున్నారు. ప్రతి చెరువుకు నీళ్లిచ్చే బాధ్యత నాది. మల్యాలలో ప్రారంభించి కుప్పం పరమసముద్రానికి నీళ్లు తీసుకొచ్చాం. 27 లిఫ్ట్ ఇరిగేషన్లు పెట్టి ఎక్కడికక్కడ నీళ్లు తరలిస్తున్నాం. కుప్పానికి రెండేళ్ల కంటే ముందే కృష్ణా పుష్కరాలు వచ్చాయి. గతంలో రాయలసీమలో కరవు వస్తే.. పశువుల కోసం రైలులో నీళ్లు తెప్పించి కాపాడుకున్నాం. నేను ఏ పని చేయాలన్నా వెంకన్నపై భారం వేసి బుల్లెట్‌లా దూసుకెళ్తా. పవిత్రమైన సంకల్పం ఉంటే ఏ పనైనా జయప్రదమవుతుందన్నారు. పోలవరం-బనకచర్ల పూర్తయి వంశధార నుంచి పెన్నానది వరకు అనుసంధానం చేయగలిగితే కరవనేదే ఉండదన్నారు. నదుల అనుసంధానం ఉపయోగాన్ని

తెలంగాణ నేతలు తెలుసుకోవాలి. నీళ్లు సద్వినియోగం చేసుకోవాలని వారికి సూచిస్తున్నా. నీళ్లు లేనప్పుడే వాటి విలువ తెలుస్తుంది. జలాశయాల్లో నీటి నిల్వ ఎంత ముఖ్యమో, భూమినే జలాశయంగా తయారు చేసుకోవడం అంతకంటే ముఖ్యం. ఒక యజ్ఞం ద్వారా అభివృద్ధి కోసం ముందుకెళ్తున్నాం. దానిని భగ్నం చేసేందుకు వైకాపా అన్ని విధాలా ప్రయత్నిస్తోంది. మీకు చేతనైతే అభివృద్ధి, సంక్షేమంలో పోటీపడండని పిలుపునిస్తున్నట్లు చంద్రబాబు చెప్పారు. వైకాపా ఒక విషవృక్షంగా తయారైంది. మనం ఏ మంచి పని చేస్తున్నా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అనుగుణంగా పాలన: నారాయణ



నెల్లూరు: ప్రజల అవసరాలు తెలుసుకుని అందుకు అనుగుణంగా ముందుకు సాగడమే ప్రజాపాలన అని ఏపీ పురపాలకశాఖ మంత్రి నారాయణ అన్నారు. కూటమి ప్రభుత్వం అదే చేస్తోందని అన్నారు. వైకాపా ప్రభుత్వం మాపై కక్షతో అనేక పనులు నిలిపివేసిందని నారాయణ అన్నారు. నెల్లూరులో పర్యటించిన ఆయన.. 15వ డివిజన్ రౌండ్ తూము వద్ద రోడ్డు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు ఏం కావాలో తెలుసుకొని పనిచేయడమే సుపరిపాలన అన్నారు. నెల్లూరులో 6 వాటర్ ఎ÷-లాంట్ల ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తామని చెప్పారు. జిల్లాలో మరికొన్ని బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైల్వే ట్రాక్‌ల వద్ద అండర్‌పాస్ బ్రిడ్జిల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. డ్రెయిన్ల పనులు 10 నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారు.

## ఆసియా కప్ క్రికెట్ మేనేజర్‌గా ప్రశాంత్

### అభినందించిన డిప్యూటీ సీఎం పవన్



విశాఖపట్నం: దుబాయ్, అబుదాబిలో సెప్టెంబరు 9 నుంచి ప్రారంభమయ్యే ఆసియా కప్ టీ-20 క్రికెట్ పోటీలకు టీమిండియా మేనేజర్‌గా నియమితులైన పీవీఆర్ ప్రశాంత్‌ను ఏపీ డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ అభినందించారు. భీమవరం జనసేన ఎమ్మెల్యే, పీఏసీ ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) కుమారుడైన ప్రశాంత్.. విశాఖ పర్యటనలో ఉన్న పవన్‌ను కలిశారు. తెలుగు వ్యక్తికి ఇలాంటి అరుదైన గౌరవం దక్కడం పట్ల డిప్యూటీ- సీఎం ఆనందం వ్యక్తం చేశారు. ఇది మనకు గర్వకారణమని అన్నారు. భవిష్యత్‌లో ప్రశాంత్ మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) ఉపాధ్యక్షుడిగా పని చేసిన ప్రశాంత్.. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అల్లుడు. గతంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి క్రికెట్‌కు ప్రాతినిధ్యం వహించారు.

## తిరుపతిలో మహిళా ఎమ్మెల్యేల సదస్సు

### సెప్టెంబరు 14, 15 తేదీల్లో నిర్వహణ: స్పీకర్



అనకాపల్లి: తిరుపతిలో మహిళా ఎమ్మెల్యేల కోసం ప్రత్యేకంగా ఓ సమావేశాన్ని ఏర్పాటుచేస్తున్నామని, సెప్టెంబరు 14, 15 తేదీల్లో మహిళా ఎమ్మెల్యేలకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు- చేస్తున్నట్టు- ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో మీడియాకు విడుదల చేసిన వీడియోలో ఈ వివరాలు వెల్లడించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల పరిధిలో ఉన్న వివిధ పార్టీలకు చెందిన సుమారు 300 మంది మహిళా ఎమ్మెల్యేలు సదస్సుకు హాజరు కానున్నట్టు- చెప్పారు. ఈ కార్యక్రమానికి తొలిరోజు సీఎం చంద్రబాబు, లోక్‌సభ స్పీకర్ హాజరవుతారని, ముగింపు రోజున గవర్నర్ హాజరుకానున్నారని ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. సదస్సుకు హాజరయ్యే ఎమ్మెల్యేలకు శ్రీవారి దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు- చేస్తున్నామన్నారు. సెప్టెంబరు 18 నుంచి శాసనసభ సమావేశాలు జరుగుతాయని, ఈమేరకు ఎమ్మెల్యేలకు సమాచారం పంపించినట్టు పేర్కొన్నారు.



## గోదావరికి పోటెత్తిన వరద

నీట మునిగిన బాసర వీధులుగోదావరికి పోటెత్తిన వరద

నీట మునిగిన బాసర వీధులు

2లో..



## యూరియా కొరతపై బిఆర్ఎస్ డ్రామాలు

వీరి రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు

మండిపడ్డ వ్యవసాయ మంత్రి తుమ్మల

2లో..



## పేదల కోసం తపించిన మహానేత సురవరం

ఆయన ఆశయాలు కొనసాగించేందకు కృషి

సురవరం సంస్మరణ సభలో సిఎం రేవంత్ రెడ్డి

2లో..

# యూరియా కొరతపై బిఆర్ఎస్ ఆందోళన

## కమిషనర్‌కు వినతి పత్రం సమర్పణ

## సచివాలయం ముందు ఆకస్మిక ధర్నా

కెటిఆర్, హరీష్ తదితరులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



" ఏ రాష్ట్రాల్లోనూ యూరియా సమస్య లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం వల్లే.. తెలంగాణలో కొరత ఏర్పడిందని చెప్పారు. గత ప్రభుత్వంలో కరోనా సమయంలోనూ ఇబ్బంది లేకుండా పంపిణీ చేసినట్లు వివరించారు. భాజపా, కాంగ్రెస్ ఒకరిపై ఒకరు నెపం వేసుకొని తప్పించుకుంటున్నారని దుయ్యబట్టారు. యూరియా పంపిణీ చేతకాకపోతే తప్పుకోవాలన్నారు.

2లో..



## తెలంగాణ కేబినెట్ సంచలన నిర్ణయం

రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేయాలని తీర్మానం

సెప్టెంబర్‌లోగా స్థానిక ఎన్నికల నిర్వహణకు అంగీకారం

ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అజారుద్దీనల పేర్లు సిఫార్సు

2లో..



## ప్రారంభమయిన తెలంగాణ అసెంబ్లీ

దివంగత ఎమ్మెల్యే గోపీనాథ్‌కు అసెంబ్లీ సంతాపం

మాగంటి గోపీనాథ్మాస్ లీడర్ అంటూ రేవంత్ నివాళి

మండలిలో దివంతగత సభ్యులకు సంతాప తీర్మానం

ఉభయ సభలు సోమవారానికి వాయిదా

2లో..

ఉదయం న్యూస్
ఎడిటర్ : సి. శేఖర్ యం

# గోదావరికి పోటెత్తిన వరద

నీట మునిగిన బాసర వీధులు




ఆదిలాబాద్:నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు రోజులుగా వరద పెరగడంతో గోదావరి నుంచి సరస్వతి ఆలయం వరకు ప్రధాన రహదారి జలమయమైంది. వరదనీరు వ్యాసమహర్షి ఆలయానికి, ఆలయ ఆవరణలోని తితిదే గృహాల వరకు చేరుకుంది. ఆలయం వద్ద దుకాణాలు, ప్రైవేటు- లాడ్జిలు, సత్రాలన్నీ నీట మునిగాయి. దీంతో సరుకులు మొత్తం నీటిలో కొట్టుకు పోయాయని దుకాణదారులు విలపించారు. గంగాదేవి, సూర్యేశ్వర శివాలయం, అక్షర కాలనీ, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్‌లు జలమయమయ్యాయి. అక్షర కాలనీలో చిక్కుకున్నవారిని ట్రాక్టర్ల సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. స్థానిక నాగభూషణ్ విద్యాలయంలో 30 మంది విద్యార్థులు, ఆరుగురు టీ-చర్లు చిక్కుకున్నారు. వరద చుట్టు-ముట్టడంతో భవనం పై అంతస్తుకు వెళ్లి తలదాచుకున్నారు. వారిని బయటకు తీసుకొచ్చేందుకు వెళ్లి మరో 8 మంది కూడా వరదనీటిలో చిక్కుకున్నారు.

## యూరియా కొరతపై బిఆర్ఎస్ డ్రామాలు

హైదరాబాద్: రాష్ట్రంలో యూరియా కొరత ఉందంటూ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ చేసిన ఆందోళనపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఫైర్ అయ్యారు. యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వం కారణమని మీకు తెలియదా అంటూ ప్రశ్నించారు. కేంద్రం వల్ల యూరియా కొరత ఉంటే మాపై విమర్శలు చేస్తారా అని బీఆర్ఎస్ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదంతా కావాలని చేస్తున్న డ్రామాగా ఆయన అభివర్ణించారు. రేవంత్ సర్కార్‌ను బద్నాం చేసేందుకే బీఆర్ఎస్ దిగజారుడు రాజకీయం చేస్తోందని విమర్శించారు. యూరియా స్లప్లైలో నిర్లక్ష్యంపై కేంద్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. యూరియాపై బీఆర్ఎస్ నేతలది కపట నాటకమని.. బీఆర్ఎస్ నాటకాలను రైతులు నమ్మరని అన్నారు. అనవసరంగా రైతులను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో యూరియా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారంబీఆర్ఎస్ నేతలు ఆందోళనకు దిగారు. ముందుగా వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగిన బీఆర్ఎస్ నేతలు.. యూరియా సమస్యను పరిష్కరించాలని వ్యవసాయ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం తెలంగాణ సచివాలయం ముందు బైఠాయించి ఆందోళన చేశారు. ఈ ధర్నాలో హరీష్ రావు, కేటీ-ఆర్, తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీఆర్ఎస్ ఆందోళనతో సచివాలయం దగ్గర కాసేపు ఉద్రిక్తత నెలకొంది. దీనిపై మంత్రి తుమ్మల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపికి అనుకూలంగా బిఆర్ఎస్ కావాలనే ఆందోళన చేస్తోందన్నారు. ఎరువులు సరఫరా చేయని కేంద్రాన్ని నిలదీయకుండా గతంలో తాము అంతా గొప్పలు చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు.

## ప్రజా సమస్యల కోసం నిరంతర పోరాటం




హైదరాబాద్: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సురవరం సుధాకర్‌రెడ్డి పనిచేశారని విశ్రాంత సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. వారి ఇబ్బందులపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ- సభ్యుడిగా నివేదికలు ఇచ్చారని గుర్తుచేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులతో కలిసి ఉద్యమాలు చేపట్టారని తెలిపారు. తనకు కూడా వామపక్ష భావజాలం పట్ల అభిమానం ఉందని పేర్కొన్నారు. సురవరం ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపారని కొనియాడారు. రవీంద్రభారతిలో దివంగత సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు- చేశారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, తమ్మినేని వీరభద్రం, సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ప్రొఫెసర్ హరగోపాల్, గుమ్మడి నర్సయ్య పాల్గొన్నారు. దశాబ్దానికిపైగా సురవరం, తాను కలిసి కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లినట్లు- బీవీ రాఘవులు తెలిపారు. అనేక పోరాటాలు, ఉద్యమాల్లో కలిసి పని చేసినట్లు- వివరించారు. సురవరం గొప్ప ప్రజాస్వామిక వాది అని కొనియాడారు. ఆయన లేని లోటు- పూడ్చలేనిదని పేర్కొన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కమ్యూనిస్టులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తాను ఎన్ఎస్‌యూఐ నాయకుడిగా ఉన్నప్పుడు తొలిసారి సురవరం సుధాకర్‌రెడ్డిని కలిసినట్లు- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఇటీవల సీపీఐ రాష్ట్ర కార్యాలయం ప్రారంభోత్సవంలో మళ్లీ కలిసినట్లు- చెప్పారు. కమ్యూనిజం ఎప్పుడూ సజీవంగా ఉంటుందన్నారు. సురవరం నిబద్ధతతో రాజకీయాలు నడిపారన్నారు. ఆయన జీవితం ఎంతో మందికి ఆదర్శమని పేర్కొన్నారు.

## తెలంగాణ కేబినెట్ సంచలన నిర్ణయం

హైదరాబాద్: తెలంగాణ కేబినెట్ సంచలన నిర్ణయం తీసుకుంది. రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేయాలని నిర్ణయించింది. పంచాయతీ రాజ్ చట్టం2018 సవరణకు ఆమోదం తెలిపిన కేబినెట్.. రిజర్వేషన్ల పరిమితిపై గత ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ అసెంబ్లీలో ప్రత్యేక బిల్లు ప్రవేశ పెట్టాలని నిర్ణయించింది. అసెంబ్లీ తర్వాత ప్రత్యేక జీవో తెచ్చి కులగణన ఆధారంగా తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని చూస్తోంది. మొత్తానికి స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనే దానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెర దింపింది. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సెప్టెంబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఎన్నికల కమిషన్‌కు తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో శనివారం భేటీ- అయిన తెలంగాణ కేబినెట్ పలు కీలక నిర్ణయాలు చేసింది. స్థానిక ఎన్నికల రిజర్వేషన్లలో పరిమితి ఎత్తివేయాలని కూడా కేబినెట్ నిర్ణయించింది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం పేర్లను గవర్నర్‌కు క్యాబినెట్ సిఫార్సు చేసింది. అసెంబ్లీ కమిటీ- హాలులో జరిగిన ఈ మంత్రివర్గ సమావేశంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంతోపాటు-, ఇటీ-వలి వర్షాలు, వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంపైనా చర్చించారు. పంటలు, రోడ్లు, ఇతర నష్టాలపై కేంద్ర ఆర్థికశాఖ సాయం కోరుతూ తీర్మానం చేశారు. కేబినేట్ వివరాలను మంత్రి పొంగులేటి మీడియాకు వివరించారు. మరోవైపు సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఇప్పటికే హైకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి కూడా క్యేబినెట్ నిర్ణయం తీసుకుందని అన్నారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్‌లోగా జరపాలని కోర్డు ఆదేశించింది. మొత్తం రిజర్వేషన్ల పరిమితి 50 శాతానికి మించకూడదని గత ప్రభుత్వం 2018 ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. దీనిపై ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ఆర్డినెన్స్ చేసి గవర్నర్ కు పంపింది. ప్రస్తుతం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి దగ్గర పెండింగ్ లో ఉందన్నారు. ముస్లీం కోటా పేరుతో బీజేపీ బిల్లును అడ్డుకుంటోంది. రాష్ట్రపతి ఆమోదం తెలపకుండా ప్రధాని మోదీ సర్కార్ అడ్డుకుంటోంది. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా 42 శాతం రిజర్వేషన్లకు ఆమోదం తెలపాలని ఢిల్లీలో నిరసన కూడా తెలిపినట్లు వెల్లడంచారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ లుగా కోదండరాం, అజారుద్దీన్ పేర్లను సిఫారసు చేస్తూ తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు తీర్పుతో కేబినెట్ మరోసారి గవర్నర్ కోటా ఎమ్మెల్సీల పేర్లను సిఫారసు చేసింది. అయితే కోదండరాం పేరుతో పాటు- ఈ సారి అమీర్ అలీ ఖాన్ స్థానంలో అజారుద్దీన్ కు స్థానం కల్పించాలని నిర్ణయించారు. ఎమ్మెల్సీలుగా కోదండరాం, ఆమిర్ అలీఖాన్ నియామకాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ 2024 ఆగస్టులో సుప్రీంకోర్టులో సివిల్ అప్లికేషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్ ను విచారించిన సుప్రీం కోర్టు.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంలో ప్రొఫెసర్ కోదండరాం, ఆమిర్ అలీ ఖాన్ కేసు విషయంలో 2025 ఆగస్టు 13 న స్టే విధించింది. 2024 ఆగస్టు 14న తాము ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల తర్వాత జరిగిన పరిణామాలు ఆ ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఉంటే ఎమ్మెల్సీల నియామకాన్ని రద్దు చేస్తామని వ్యాఖ్యానించింది.

# యూరియా కొరతపై బిఆర్ఎస్ ఆందోళన

హైదరాబాద్:రైతు సమస్యలు, పంట నష్టం, యూరియా కొరతపై వ్యవసాయ శాఖ కమిషనర్‌కు భారత రాష్ట్ర సమితి నేతలు వినతి పత్రం అందజేశారు. అనంతరం కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అన్నదాతల సమస్యలను పరిష్కరించాలని బైఠాయించారు. దీంతో కేటీఆర్, హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డితో పాటు పార్టీ ఎమ్మెల్సీలు, నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అంతకుముందు హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఏ రాష్ట్రంలోనూ యూరియా సమస్య లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం వల్లే.. తెలంగాణలో కొరత ఏర్పడిందని చెప్పారు. గత ప్రభుత్వంలో కరోనా సమయంలోనూ ఇబ్బంది లేకుండా పంపిణీ చేసినట్లు- వివరించారు. భాజపా, కాంగ్రెస్ ఒకరిపై ఒకరు నెపం వేసుకొని తప్పించు కుంటున్నారని దుయ్యబట్టారు. యూరియా పంపిణీ చేతకాకపోతే తప్పుకోవాలన్నారు. తాము రాజకీయాల కోసం రాలేదని.. రైతుల కోసం వచ్చినట్లు- పేర్కొన్నారు. యూరియా కోసం వెళ్తే రైతులపై దాడి చేస్తున్నారని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. కొరత సమస్యపై ఒక్కరోజైనా సమీక్ష చేశారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్నదాతలకు కష్టాలు మొదలైన సంగతి తెలిసిందే. నాటి నుంచి నేటి వరకు రైతులకు



అండగా నిలుస్తూ.. వారి పక్షాన బీఆర్ఎస్ నేతలు పోరాడుతూనే ఉన్నారు. గత కొద్ది రోజుల నుంచి యూరియా కొరతపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతుల కష్టాలపై బీఆర్ఎస్ నేతలు స్పందిస్తూనే ఉన్నారు. ఇవాళ కూడా వ్యవసాయ శాఖ కమిషనర్‌కు యూరియా కొరతను తక్షణమే తీర్చాలంటూ రైతుల తరపున బీఆర్ఎస్ నేతలు వినతిపత్రం సమర్పించామని అన్నారు.

ఆ తర్వాత ఎమ్మెల్యే హరీశ్‌రావు నేతృత్వంలో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ సచివాలయాన్ని ముట్టడించారు. సచివాలయం ప్రధాన గేటు- వద్ద బైఠాయించారు. యూరియా కొరత తీర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో సచివాలయం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు- చేశారు. యూరియా సంక్షోభానికి కారణం కాంగ్రెస్ పార్టీ అంటూ నినాదాలు చేశారు. పండగపూట కూడా రైతన్నలను రోడ్లపై నిలబెట్టింది ఈ ప్రభుత్వం అని ధ్వజమెత్తారు. గణపతి బప్పా మోరియా - కావాలయ్యా యూరియా అంటూ నినదించారు. రైతన్నలకు ఎరువులు సరఫరా చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని నినాదాలు చేశారు. రైతన్నలకు యూరియా వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ దోషం - రైతన్నకు మోసం అంటూ నినాదాలు చేశారు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.

# ప్రారభమయిన తెలంగాణ అసెంబ్లీ

హైదరాబాద్: తెలంగాణ శాసనసభ, మండలి సమావేశాలు ప్రారంభమయ్యాయి. నాలుగైదు రోజుల పాటు ఈ సమావేశాలు నిర్వహించే అవకాశాలున్నాయి. నూతనంగా ఎన్నికై- శాసనమండలి సభ్యులను మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సభకు పరిచయం చేశారు. అలాగే ఇటీవల మృతిచెందిన మండలి మాజీ సభ్యులు మాగం రంగారెడ్డి, రత్‌ఆకర్‌లకు సభ నివాళి అర్పించిన అనంతరం సోమవారానికి వాయిదే పడింది. అసెంబ్లీలో మరోవైపు ఇటీవల మృతి చెందిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతికి సబ సంతాపం ప్రకటించింది. గోపీనాథ్ మృతిపట్ల సీఎం రేవంత్‌రెడ్డి శాసనసభలో సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. విద్యార్థి రాజకీయాల్లో గోపీనాథ్ చురుగ్గా ఉండేవారని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. 1985 నుంచి 1992 వరకు తెలుగు యువత అధ్యక్షుడిగా పని చేశారని, ఎన్టీఆర్‌కు విశ్వాసపాత్రుడిగా గోపీనాథ్‌కు సత్సంబంధాలు ఉండేవన్నారు. విద్యార్థి నేతగా , ప్రజాప్రతినిధిగా, సినీ నిర్మాతగా రాణించారని చెప్పారు. గోపీనాథ్



తనకు మంచి మిత్రుడని, సన్నిహితుడని గుర్తు చేసుకున్నారు. గోపీనాథ్ తనకు చిన్ననాటి నుంచే మిత్రుడని పేర్కొన్నారు. ఆయన మృతి తనను వ్యక్తిగతంగా తీవ్రంగా కలిచివేసిందని గోపీనాథ్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సంతాప తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా సీఎం రేవంత్ మాగంటి గోపీనాథ్ జీవన ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. రాజకీయంగా పార్టీలు వేరైనా.. వ్యక్తిగతంగా నాకు మంచి మిత్రుడని తెలిపారు. ఆయన విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుకుగా ఉన్నారని అన్నారు. 1983లో ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీలో ఆయన తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారని.. 1985 నుండి 1992 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తెలుగు యువత అధ్యక్షుడిగా సేవలందించారని తెలిపారు. 1987-88 లో హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ- డైరెక్టర్‌గా 1988-93లో జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యుడిగా విశేష కృషి చేశారు. గోపీ ఎన్టీఆర్‌కు గొప్ప భక్తుడు. సినీరంగంలోనూ నిర్మాతగా రాణించారు. వరసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్ని-కై- ఘనత సాధించిన వారిలో మాగంటి గోపీనాథ్ ఒకరని అసెంబ్లీలో సీఎం రేవంత్ తెలియజేశారు. చూడటానికి ఆయన క్లాస్ గా కనిపించినా జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఆయన మాస్ లీడర్ అని అన్నారు. గోపీనాథ్ అకాల మరణం వారి కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చిందని.. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నట్లు- పేర్కొన్నారు. మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లు మాట్లాడుతూ గోపీనాథ్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. గోపీనాథ్‌తో తనకు చిరకాల మిత్రుత్వం ఉందని శ్రీధర్ బాబు అన్నారు. తరవాత కెటిఆర్, ఇతర సభ్యులుఉమాట్లాడుతూ గోపీనాథ్ మృతికి సంతాపం ప్రకటించారు. అనంతరం సభ సోమవారానికి వాయిదా పడింది.

# ప్రకృతి విధ్వంసానికి పరాకాష్ట !

ప్రకృతి విధ్వంసంపై ప్రజల్లో చైతన్యం కానరావడం లేదు. మన చేజేతులా ప్రకృతిని నాశనం చేస్తున్నాం. ఫలితం అనుభవిస్తున్నాం. మనం జీవించి ఉండగానే ఎన్నో విపత్తులను చూస్తున్నాం. ఎక్కడిక్కడ చెరువుల విధ్వంసం, ఆక్రమణలతో ఇప్పుడు ఇళ్లలోకి వరదనీరు వచ్చి చేరుతోంది. ఎందుకిలా జరిగిందో, జరుగుతుందో ఆలోచించడం లేదు. ఇల్లూవాకిలీ, పొలంగట్రా నీట మునిగాక ప్రభుత్వాలను నిందిస్తూ సాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నాం. ప్రతి గ్రామంలో వందల ఏళ్ల క్రిం ఉన్న చెరువులును గుట్టలను, వాగులను వంకలను మాయం చేస్తున్నాం. మనకు లాభం జరిగిందా లేదా అన్న కోణంలోనే ఆలోచన చేస్తున్నాం. అదుకే ప్రకృతి ప్రకోపించి మన ఇళ్లనే మనముందే ముంచేస్తోంది. అందుకు తాజా వర్షాలే నిదర్శనం. చెరువుఉల, వంకలు, వాగులు అలాగే ఉండివుంటే వచ్చిన నీరు వచ్చినట్లు మళ్లీ పోయేది. దానికి దారిలేకుండా చేసిన పాపానికి మనం ఫలితం అనుభవిం చాల్సిందే. తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తరాది రాష్ట్రాలు జలప్రళయంతో విలవిల్లాడుతున్నాయి. నిజామాబాద్, మెదక్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో వరదలకు ప్రకృతి విధ్వంసం కారణమని గుర్తించాలి. ఇకపోతే క్లౌడ్ బరస్ట్‌తో కుంభవృష్టి కురుస్తోంది. ఉత్తరాదిలోని ఉత్తరాఖండ్ లోని రుద్రప్రయాగ్, చమోలీ జిల్లాల్లో కుంభవృష్టి అనేక గ్రామాలను ముంచెత్తుతోంది. ఉత్తరాఖండ్‌లో తాజాగా మరోసారి క్లౌడ్‌బర్స్ సభవించింది. అనేక చోట్ల ఇళ్లుకూలి అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్ రాష్ట్రాల్లో అనేక జిల్లాలకు సంబంధాలు తెగిపోయాయి. జమ్మూకశ్మీర్‌లో ఇప్పటివరకు 40 మంది ప్రాణాలు కోల్పోయారు. శ్రీనగర్, అనంత్‌నాగ్‌ల్లో నదులు ప్రమాదస్థాయిని మించి ఉప్పొంగడంతో, గండ్లుపడి లోతట్టు



ప్రాంతాలు జలమయమయ్యాయి. పంజాబ్‌లో గ్రామాలన్నీ జలదిగ్బం ధంలో చిక్కుకున్నాయి. వ్యవసాయ భూములు అదృశ్యమయ్యాయి. దేశ రాజధాని ఢిల్లీలో కూడా భారీ వర్షపాతం నమోదైంది. యమునా నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. నైరుతి పవనాల ప్రభావం తీవ్రంగా ఉంటోంది. ఈ ఆగస్టులో ఎప్పుడూ లేనంతగా క్లౌడ్ బరస్ట్ కారణంగా భారీ వర్షాలు ప్రారంభమయ్యాయి. హిమాలయ పర్వత వాలు ప్రాంతాలు ఒరిగిపోయాయి. మైదానప్రాంతాల్లో గట్లు దెబ్బతిన్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంటపొలాలు నీట మునిగాయి. రైతన్నలు పూర్తిగా రోడ్డున పడ్డారు. తక్కువ సమయాల్లో ఎడతెరిపిలేని కుంభవృష్టి స్థానిక నేలకోతను పెంచుతుంది. కొండచరియలు విరిగిపడి సమీప నివాసాలను ధ్వంసం చేస్తున్నాయి. ఊళ్లకు ఊళ్లే కొట్టుకు పోతున్నాయి. పదుల సంఖ్యలో జనం మృత్యువాత పడుతున్నారు. ఒఇలా ఎందుకు జరుగుతుందో ప్రజలు ఆలోచించాలి. ప్రభుత్వాలు చర్చించాలి. కార్యాచరణకు దిగాలి. ప్రకృతి వైపరీత్యాల నుంచి అనుభవాలు నేర్చుకోవడం లేదు. మనం చేస్తున్న విధ్వంసం గురించి మాట్లాడకుండా, వాటిని విస్మరించి ప్రకృతి విపత్తును అసాధారణమైనదిగా చర్చిస్తున్నాం. కొండచరియలు విరిగి పడడానికి కూడా మనం చెట్లను తొలగించడం, బండలను పగుల గొట్టడం అని తెలుసుకోవడం లేదు. దేశంలోని 16 రాష్ట్రాలు, హిమాలయ రీజియన్ లోని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు, ఈశాన్యంలోని హిమాలయ పర్వత దిగువ భాగాలు, పశ్చిమ కనుమలు ఇవన్నీ కొండచరియలు విరిగిపడే ప్రాంతాలుగా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధ్యయనంలో గుర్తించింది.

రోడ్లు, రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలు, ఎలాంటి ప్రణాళిక లేకుండా సాగించే కొండ క్వారీ పనుల కారణంగా కొండచరియలు విరిగిపడడానికి కారణమవుతున్నాయని హెచ్చరించింది. హిమాలయ పర్వత ప్రాంతాల్లో ఇష్టం వచ్చినట్లుగా చెట్లను కూల్చివేశారు. దీంతో కొండలపై ఉన్న సారవంతమైన మట్టి వర్షాలకు కొట్టుకుపోయి, కొండచరియలు విరిగిపడుతున్నాయి. దీంతోపాటు- పంట పొలాల్లోకి, ఇళ్లలోకి బురద ప్రవాహంలా వచ్చిచేరుతోంది. ఎన్నో ప్రాణాలు జలసమాధి అవుతున్నాయి. ఇవన్నీ స్వయం కృతాపరాధాలే. పర్యావరణ సున్నితమైన హిమాలయ రాష్ట్రాల్లో కొండవాలు ప్రాంతాలు అత్యంత బలహీనమైనవని, వాటిని తిరిగి పొందలేమని పర్యావరణ శాస్త్రవేత్తలు ఎన్ని హెచ్చరికలు చేసినా పెడచెవిన పెడుతున్నాం. ప్రజలు, ప్రభుత్వం చేస్తున్న విధ్వంసంగా దీనిని గుర్తించాలి. ప్రభుత్వాలు ఈ విధ్వంసాన్ని అడ్డుకోవడం లేదు. అలాగని ప్రజలు కూడా తమ వైఖరి మార్చుకోవడం లేదు. అంతెందుకు మనదగ్గర పోడు వ్యవసాయంతో అడవులను నరికివేస్తున్నాం. దీనిని అడ్డుకుని అడవులను పెంచాల్సిన బాధ్యతలను విస్మరించి, పోడు రైతులను ప్రోత్సహిసతున్నారు. భారీ వర్షాల కారణంగా భూమి కొతకు గురికావడంతో ఆనకట్టల్లో పూడిక పేరుకుపోతోంది. వరదలతో దిగువ ప్రవాహాలు పెరుగుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు అదే పనిగా సంభవిస్తున్నాయనడానికి ఇదంతా మానవ తప్పిదమని గుర్తించడం లేదు. అవసరాల కోసం అడవులను నరికివేస్తున్నారు. కొండవాలు ప్రాంతాలను తొలగించడం, పరీవాహక ప్రాంతం కుదించుకుపోవడం, జనాభా పెరిగిపోతుండడం వీటన్నిటి ఫలితం ఎంతటి విధ్వంసాన్ని కలిగిస్తుందో ప్రత్యక్షంగా చూస్తున్నాం. ఈ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఒక ప్రణాళికతో ప్రకృతి విధ్వంసాన్ని ఆపితే..కొంతయినా తగ్గించు కోవడం సాధ్యం కాగలదు. తరచుగా సంభవిస్తున్న ఈ విపత్తుల నివారణకు ముందస్తు ప్రణాళికలు ఆలోచించడం లేదు. ఇప్పటికీ సమయం మించిపోలేదు. దీనికంతటికీ కారణమైన పలు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. చెట్లను నరకడం, గుట్ంటలను పిండిచేయడం, కొండవాలు ప్రాంతాలను ధ్వంసం చేసయడం, అడవులను నరకడం తక్షణం ఆపాలి. కాలువుల, చెరువులను పునరుద్ధరించాలి.

# వినాయక నిమజ్జన వేడుకలను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలి :టూ టౌన్ సీఐ నాగార్జున రెడ్డి



వినాయక నిమజ్జన వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి అన్నారు. శనివారం ఆయన వినాయక కమిటీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. గణపతి మండపాలకు విద్యుత్ తీగలను ఎవరూ అనవసరంగా ముట్టుకోకుండా చూసుకోవాలన్నారు. కవర్ లేని హాలోజన్, లాంపులను వాడవదన్నారు. రాత్రి సమయంలో ముగ్గురు వాలంటీర్లు మండపంలో నిద్రించాలన్నారు. ఇక మండలపాల వద్ద పందులు, కుక్కలు రాకుండా స్టేజీ కింద ఖాళీ స్థలంలో చెక్కతో మూసి ఉంచాలన్నారు. ఇక మండపాల వద్ద అగ్ని ప్రమాదాలకు కారణమయ్యే బాణాసంచ తదితర వస్తువులను ఉంచరాదని తెలిపారు. మండపాల వద్ద జరిగే కార్యక్రమాలు రోడ్డుపైకి రాకుండా నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాత్రి సమయంలో మండపాలను మూసే సమయంలో నూనె దీపం విషయంలో జాగ్రత్తలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని చెప్పారు. వినాయక మండపాల వద్ద కొత్త వస్తువులు, బ్యాగులు, బ్రీఫ్‌కేసులు, బొమ్మల వస్తువలపై నిఘా ఉంచాలన్నారు. అందులో పేలుడు పదార్థాలు ఉండే అవకాశం ఉందని చెప్పారు. ప్రతిరోజు మండపాలను కమిటీ సభ్యులు సోదా చేసి ఏదైనా అనుమానిత వస్తువులు ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. భక్తులు తమ వెంట తెచ్చే లగేజీ, బ్యాగులను మండపాల వద్ద అనుమతించకూడదన్నారు. ఇక మండపాల వద్ద వాహనాలు పార్కింగ్ చేయకుండా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందన్నారు. ఆదివారం నిర్వహించే నిమజ్జన వేడుకలను డీజే లు టపాసులు బాణా సంచాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకుని శాంతిభద్రతల సీసీ కెమెరాల పరిరక్షణల నడుమ ప్రశాంత వాతావరణంలో పూర్తిచేయాలని సీఐ నాగార్జునరెడ్డి సూచించారు.

# పరామర్శించిన

**గంగవరం గ్రామ సీనియర్ నాయకులు ప్రహల్లధ రెడ్డి గారిని పరామర్శించిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి బుట్టా రేణుక**



**ఎమ్మిగనూరు ఉదయం న్యూస్ ప్రతినిధి**

నందవరం మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీ ప్రహల్లధ రెడ్డి గారు ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతున్న విషయం తెలిసిన వెంటనే ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి బుట్టా రేణుక గారు, రాష్ట్ర యువజన విభాగ ఉపాధ్యక్షులు శ్రీ బుట్టా ప్రతుల్ గారు, నందవరం మండల పార్టీ అధ్యక్షులు జే.శివారెడ్డి గారు, రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి కె.ఆర్. లక్ష్మి కాంత్ రెడ్డి గారు, రాష్ట్ర బిసి సెల్ సంయుక్త కార్యదర్శి వీరుపాక్షి రెడ్డి గారు, సీనియర్ నాయకులు కె.ఆర్. రామకోటేశ్వర్ రెడ్డి గారు, నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి గారు, ప్రచార విభాగ అధ్యక్షులు చాంద్ భాష గారు, మండల ఉపాధ్యక్షులు రాఘవరెడ్డి గారు ఆయన నివాసానికి చేరుకుని ఆయనను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో మండల యువజన విభాగం నాయకులు సూర్యప్రకాష్ రెడ్డి, మనోహర్ రెడ్డి, జయరామ్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, శివన్న, టి. నరసింహులు, దేవరాజు, బద్రి, సోమన్న, మల్లయ్య, హనుమంతు, వెంకటేశులు, విజయమోహన్ రెడ్డి, రంగారెడ్డి, సంజీవ రెడ్డి, బాలారెడ్డి, నరసింహులు, రాఘవరెడ్డి, శంకర్ రెడ్డి, కృష్ణమూర్తి, రామంజి, దస్తగిరి, అలాగే సోషల్ మీడియా నియోజకవర్గ అధ్యక్షులు ఎం.యండి. షరీఫ్, జిల్లా కార్యదర్శి కదిరికోట రాజ్‌కుమార్, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# వైకాపా IASలపై బదిలీ వేటు...!?

**నేడో...రేపో భారీగా ఐఏఎస్‌లు బదిలీలు**

**కసరత్తుపూర్తి చేసిన సిఎం చంద్రబాబు**

**పలు జిల్లాల కలెక్టర్ల మార్పు...!**

**భారీగా ఐపిఎస్ లూ బదిలీ...!**

దాదాపు ఏడాదిన్నర తరువాత రాష్ట్ర ప్రభుత్వం భారీగా ఐఏఎస్‌లను బదిలీ చేయబోతోంది. ఏడాదిన్నర క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అధికారవ్యవస్థపై పట్టుసాధించలేదనే భావన అధికార పార్టీలోనే వ్యక్తం అవుతోంది. దీనికి కారణం వ్యవస్థలోని కొందరు ఐఏఎస్ అధికారులు వైకాపాకు మద్దతు ఇస్తూ లోపాయికారీగా వారికి సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులకు ఎంత స్వేచ్ఛ ఇచ్చినా..వారు మాత్రం వైకాపా నాయకులకే వత్తాసు పలుకుతున్నారని, వారి పనులే చేస్తున్నారనే టిడిపి, జనసేన నాయకులు ఇప్పటిదాకా ఫిర్యాదులపై ఫిర్యాదులు చేస్తున్నారు. ఇటువంటి వారిని బదిలీ చేయాలని వారంతా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని పలుసార్లు కోరినా..ఆయన వారిని బదిలీ చేయలేదు. అయితే..ఏడాదిన్నర నుంచి వేచి చూసిన ఆయన ఇక వారిలో మార్పురాదని గమనించి, అటువంటి వారిని బదిలీ చేయడానికి సిద్ధం అవుతున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా సచివాలయంలో కొందరు ఐఏఎస్‌లు వైకాపాకు పరోక్షంగా మద్దతు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటువంటి వారితో పాటు జిల్లా కలెక్టర్లు కొందరు వైకాపా ఏజెంట్లుగా పనిచేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో వీరందరినీ ఇప్పుడు బదిలీ చేయబోతున్నట్లు ఆ వర్గాలు చెబుతున్నాయి.వీరితో పాటు పలువురు ఐపిఎస్ అధికారులను బదిలీ చేయబోతున్నారు. ముఖ్యంగా జిల్లాల ఎస్పీలను మారుస్తారనే ప్రచారం ఉంది. ముఖ్యంగా వైకాపాతో అంటకాగుతోన్న వారిపై బదిలీ వేటు వేయబోతున్నట్లు సమాచారం. వారితో పాటు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నవారిని కూడా బదిలీ చేస్తారంటున్నారు. కొన్ని జిల్లాల కలెక్టర్ల పనితీరు ముఖ్యమంత్రికి నచ్చడం లేదని, వారు ఎంత చెప్పినా తీరు మార్చుకోవడం లేదని, దీంతో వారిపై వేటు వేయాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారని తెలుస్తోంది. కాగా ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు డిప్యూటేషన్‌పై వచ్చేవారికి కీలక పోస్టులు ఇవ్వబోతున్నారు. కొందరు శాఖాధిపతులను ఇతర శాఖలకు బదిలీ చేస్తారంటున్నారు. ముఖ్యంగా ఇరిగేషన్, పంచాయితీరాజ్,మున్సిపల్, వైద్య,ఆర్థిక,పరిశ్రమల శాఖలకు చెందిన శాఖాధిపతులను బదిలీ చేస్తారంటున్నారు. కాగా ముఖ్యమంత్రి కార్యాలయంలోనూ మార్పులు జరుగుతాయనే ప్రచారం ఉంది. అయితే..సిఎంఓలో ఎవరినీ కదిలించరని ప్రచారమూ ఉంది. ముఖ్యంగా యువ ఐఏఎస్ అధికారిని బదిలీ చేస్తారని ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతున్నా..ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు అభిమానం పొందారని ఆయనను ఎట్టి పరిస్థితుల్లో బదిలీ చేయరని కొందరు సీనియర్ ఐఏఎస్ అధికారులు అంటున్నారు. కాగా తిరుమల తిరుపతి దేవస్థానం ఇఓను బదిలీ చేస్తారనే ప్రచారమూ ఉంది. అక్కడ ఉన్న శ్యామలరావును బదిలీ చేసి ఆయన స్థానంలో మరో సీనియర్ ఐఏఎస్‌ను అక్కడకు పంపుతారనే ప్రచారం ఉంది. మొత్తం మీద...నేడో..రేపో..బదిలీలు జరగవచ్చు. ఒక వేళ ఈ రెండు రోజుల్లో జరగకపోతే సోమవారం నాడు ఖచ్చితంగా బదిలీల జీవో రావచ్చని తెలుస్తోంది.

# ఎపి భవన్ కమీషనర్‌గా సౌరభ్ గౌర్

న్యూఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ రెసిడెంట్ కమీషనర్‌గా పౌరసరఫరాలశాఖ కమీషనర్ సౌరభ్ గౌర్‌ను ప్రభుత్వం తాత్కాలికంగా నియమించింది. ప్రస్తుతం ఎపి భవన్ రెసిడెంట్ కమీషనర్‌గా ఉన్న లవ్ అగర్వాల్ కేంద్ర సర్వీసులకు వెళ్లడంతో ఆయన స్థానంలో పూర్తి అదనపు బాధ్యతలతో గౌర్‌ను ప్రభుత్వం నియమించింది. లవ్ అగర్వాల్ తాను కేంద్ర సర్వీసులకు వెళతానని కోరడంతో ప్రభుత్వం ఆయనను రిలీవ్ చేసింది. లవ్ అగర్వాల్‌ను కేంద్రంలోని మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖలో అదనపు కార్యదర్శిగా కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఆయన నియామకాన్ని కేబినెట్ మంత్రుల నియామక కమిటీ (ఎసిసి) ఆమోదించింది. కాగా ప్రభుత్వ తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ సౌరబ్ గౌర్ ఎపి భవన్ ఇన్‌ఛార్జి రెసిడెంట్ కమీషనర్‌గా పదవీ బాధ్యతలు నిర్వహిస్తారు.

# రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను త్వరగా నియమించుకోవాలి

**జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**

**కర్నూలు ఆగస్టు 30:**

రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను త్వరగా నియమించుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు.శనివారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో త్వరలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జరుగనుందని తెలిపారు.. బూత్ లెవెల్ ఆఫీసర్ ల నియామకాన్ని పూర్తి చేసి, ట్రైనింగ్ కూడా పూర్తి చేశామని, అదేవిధంగా రాజకీయ పార్టీలు కూడా బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకొని శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.అలాగే 1200 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను హేతుబద్ధీకరించాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో కొత్తగా 237 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే 2203 పోలింగ్ స్టేషన్ లు ఉండగా, కొత్తగా ప్రతిపాదించిన పోలింగ్ కేంద్రాలను కలిపితే మొత్తం 2440 కేంద్రాలు అవుతాయన్నారు..
క్రొత్తగా ప్రతిపాదించిన పోలింగ్ స్టేషన్ ల ఏర్పాటు, స్థాన మార్పు, నామకరణ మార్పు మొదలైన వాటికి సంబంధించి ఏవైనా సూచనలు ఉంటే, నేరుగా %ERO% లేదా జిల్లా ఎన్నికల అధికారికి ఇవ్వవలసిందిగా కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధుల కు సూచించారు.సమావేశంలో డిఆర్ఓ వెంకటనారాయణమ్మ ,బహుజన సమాజ్ వాదీ పార్టీ డిస్టిక్ ఇంచార్జ్ అరుణ్ కుమార్, తెలుగుదేశం పార్టీ తరపున ఎల్. వి. ప్రసాద్,ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరపున బజారన్న, ఎన్నికలంవిభాగం సూపరిండెంట్ మురళి హాజరయ్యారు.

# కుప్పంకు కృష్ణమ్మ పరుగులు

**నందికొట్కూరు నియోజకవర్గం**



నందికొట్కూరు మండలం మల్యాల %HNSS% పంప్ హౌస్ దగ్గర జల హారతి కార్యక్రమంలో పాల్గొన్న నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య గారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాయలసీమలోని ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసుల దశాబ్దాలనాటి కల సాకారమయింది. హంద్రీ నీవా ప్రాజెక్ట్ ద్వారా కుప్పం బ్రాంచి కాలువకు కృష్ణానదీ జలాలు కుప్పం నియోజకవర్గంలోకి అడుగుపెట్టాయి. అన్నారు నలుగురు ముఖ్యమంత్రుల వల్ల కాని పనిని ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు పూర్తి చేశారు. 1987 లో అన్న ఎన్టీఆర్ హంద్రీనీవా ప్రాజెక్ట్ కు శ్రీకారం చుడితే నేడు సీఎం చంద్రబాబు గారి సారథ్యంలో పూర్తయింది. అన్నారు భగీరథుడిలా ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు 14 నెలల కాలంలోనే హంద్రీనీవా కాలువలను ఆదునీకీకరించి 730 కి. మీ. రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో కృష్ణా జలాలను పారించి, రైతాంగానికి సాగునీరు అందించి భరోసా కల్పించారు. అన్నారు 2014–19 మధ్య కాలంలో హంద్రీ నీవా ప్రాజెక్టుకు చంద్రబాబు గారి ప్రభుత్వం రూ.4,182 కోట్లు ఖర్చు చేసి 80 శాతం పనులు పూర్తి చేసింది. అన్నారు ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో రూ.3,870 కోట్లు విడుదల చేసి ఫేజ్1, ఫేజ్ 2 కాలువ లైనింగ్ పనులను స్వయంగా సీఎం చంద్రబాబు గారే ప్రారంభించి... అధికారులకు డెడ్ లైన్ విధించి మరీ పనులను పూర్తి చేయించారు. అన్నారు 2023 జనవరిలో నిర్వహించిన యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ గారు కుప్పం ప్రజలకు హామీ ఇచ్చి నేడు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. అన్నారు సుమారు 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే హంద్రీనీవా పనులు పూర్తి చేసి రాయలసీమ చరిత్రలో నిలిచిపోయే నాయకుడిలా చంద్రబాబు గారు మాట నిలబెట్టుకున్నారు. అన్నారు జూలై 17న మల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద నుంచి హంద్రీనీవాకు ముఖ్యమంత్రి చంద్రబాబు గారు నీటిని విడుదల చేశారు. సరిగ్గా 40 రోజుల్లో కుప్పంకు సాగునీరు అందించి అక్కడ పమరసముద్రం వద్ద జలహారతి ఇవ్వనున్నారు. అన్నారు ఎమ్మెల్యే గిత్త జయసూర్య గారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి గారు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మాంద్ర సురేంద్రనా

# రౌడీల ఆగడాలను కూటమి ప్రభుత్వం ఉపేక్షించదు

వైసీపీ అరాచక మూలాలతోనే తాజా పరిణామాలు అరాచక శక్తులను కూకటివేళ్లతో సహా పెకిలించేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ అవసరంకోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి హత్యకు కుట్ర వెనకున్న అసలు వ్యక్తులెవరో తేలాలినెల్లూరులోని సరస్వతినగర్ లో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, గిరిధర్ రెడ్డితో భేటీ అయిన సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కోటంరెడ్డికి సంఘీభావం ప్రకటించి తాజా పరిణామాలపై చర్చించిన సోమిరెడ్డి మీడియాతో సోమిరెడ్డి కామెంట్స్ జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు చాలా దురదృష్టకరం గత ఎన్నికల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లాతో పాటు కందుకూరు కలిపి 11 సీట్లు కోల్పోవడాన్ని వైసీపీ జీర్ణించుకోలేకపోతోందిరౌడీ గ్యాంగులు కుట్రలు చేస్తున్న ఘటనలను పోలీసులు, ఇంటిలిజెన్స్ సీరియస్ గా తీసుకోవాలి సర్వేపల్లిలో కాకాణి గోవర్ధన్ రెడ్డి అనుచరులు మా నాయకులపై దాడులకు తెగబడ్డారు కావలిలో కావ్యా కృష్ణారెడ్డి హత్యకు డ్రోన్లు, కత్తులతో ప్లాన్ చేశారు ఇప్పుడు నెల్లూరు రూరల్ లో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని ఎత్తేస్తామంటున్నారు నిన్న వెలుగుజూసిన వీడియో పాతది కాదని, ఇటీవలే జరిగిన కుట్రగా తెలుస్తోందిపోలీసులు కొంత గట్టిగా వ్యవహరించాల్సివుంది. క్రిమినల్స్ గుండెల్లో రైళ్లు పరిగెత్తాల చర్యలు ఉండాలికూటమి ప్రభుత్వంలోనూ వైసీపీ గ్యాంగులు చెలరేగిపోతుండటం సహించరాని విషయం ప్రశాంతతకు మారుపేరైన నెల్లూరు జిల్లాలో జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు అవసరమైతే ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ను రంగంలోకి దించాలికోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి హత్యకు ప్లాన్ చేసిన వారి విషయంలో సీరియస్ గా చర్యలు తీసుకోవాలి దాదాపు ఏడు, ఎనిమిది మంది వీడియోలో కనిపిస్తున్నారు అసలు సూత్రధారులెవరు, ఆ రౌడీల వెనుక ఉన్న నేతలెవరో తేల్చాల్సిన అవసరం ఉందికూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు దాటుతున్నా రౌడీ గ్యాంగుల కదలికలను పోలీసులు ఎందుకు కనిపెట్టలేకపోతున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు జగన్ రెడ్డి నెల్లూరుకు వచ్చిన రోజు హెడ్ కానిస్టేబుల్ కాలు విరగ్గొట్టారుగతంలో ఇలాంటి పరిణామాలు ఎప్పుడూ చోటుచేసుకోలేదు వైసీపీ ఐదేళ్ల పాలనలో వ్యవస్థలను సర్వనాశనం చేశారు..జిల్లాకు చెడ్డపేరు తెచ్చారు రౌడీలను మూలాలతో సహా పెకిలించి నెల్లూరును ఎప్పటిలాగే ప్రశాంతంగా ఉంచాల్సిన బాధ్యత పోలీసులపై ఉందిక్రిమినల్స్ పై చర్యలు తీసుకునే విషయంలో ప్రజాప్రతినిధులందరం పోలీసులకు సంపూర్ణ సహకారం అందిస్తాంశ్రీధర్ రెడ్డికి ప్రాణాపాయముందని తెలిసిన వెంటనే ఆయనను అప్రమత్తం చేయడంతో పాటు అదనపు భద్రత కల్పించాల్సిందిజగన్ రెడ్డి సీఎం అయిన తెల్లారి నుంచే అన్నపూర్ణ లాంటి ఏపీని అరాచక ఆంధ్రప్రదేశ్ గా మార్చారు..ఇప్పటికీ ఆ మూలాలు కొనసాగుతున్నాయి అరాచకాలను మా కూటమి ప్రభుత్వం కానీ, చంద్రబాబు నాయుడు కానీ, పవన్ కళ్యాణ్ కానీ, బీజేపీ కానీ ప్రోత్సహించరు మా చేతులు కట్టేసివున్నారనే విషయం నాలుగు రోజుల క్రితమే శ్రీధర్ రెడ్డి కూడా గుర్తు చేశారు గత ప్రభుత్వంలో ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే 50 మందికి పైగా అక్రమ కేసులతో జైళ్లకు పంపారు ఇప్పుడు మేం తప్పు చేసిన వారిని మాత్రమే జైళ్లకు పంపించాలని పోలీసు అధికారులకు సూచిస్తునా



# గణనాథుడి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

**జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**

కర్నూలు, ఆగస్టు 30:- గణనాథుడి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు....శనివారం సమాచార శాఖ కార్యాలయం ప్రాంగణం లో ఏర్పాటు చేసిన పాత్రికేయ గణపతిని జిల్లా కలెక్టర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు... ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గణనాథుని ఆశీర్వాదంతో ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా, సుఖశాంతులతో ఉండాలని కోరారు... అదే విధంగా జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా ముందుకు సాగాలని కలెక్టర్ ఆకాంక్షించారు..... అనంతరం పాత్రికేయ ఉత్సవ గణపతి సమితి సభ్యులు కలెక్టర్ గారికి సన్మానం చేశారు ... జిల్లా కలెక్టర్ గారితో పాటు సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు కె.జయమ్మ, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు...



**కర్నూలు,30-08-25 కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా గారు.**

# ప్రకృతి విధ్వంసానికి పరాకాష్ట !

ప్రకృతి విధ్వంసంపై ప్రజల్లో చైతన్యం కానరావడం లేదు. మన చేజేతులా ప్రకృతిని నాశనం చేస్తున్నాం. ఫలితం అనుభవిస్తున్నాం. మనం జీవించి ఉండగానే ఎన్నో విపత్తులను చూస్తున్నాం. ఎక్కడిక్కడ చెరువుల విధ్వంసం, ఆక్రమణలతో ఇప్పుడు ఇళ్లలోకి వరదనీరు వచ్చి చేరుతోంది.ఎందుకిలా జరిగిందో,జరుగుతుందో ఆలోచించడం లేదు. ఇల్లూవాకిలీ, పొలంగట్రా నీట మునిగాక ప్రభుత్వాలను నిందిస్తూ సాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నాం. ప్రతి గ్రామంలో వందల ఏళ్ల క్రిం ఉన్న చెరువులును గుట్టలను, వాగులను వంకలను మాయం చేస్తున్నాం. మనకు లాభం జరిగిందా లేదా అన్న కోణంలోనే ఆలోచన చేస్తున్నాం. అదుకే ప్రకృతి ప్రకోపించి మన ఇళ్లనే మనముందే ముంచేస్తోంది. అందుకు తాజా వర్షాలే నిదర్శనం. చెరువుఉల, వంకలు, వాగులు అలాగే ఉండివుంటే వచ్చిన నీరు వచ్చినట్లు మళ్లీ పోయేది. దానికి దారిలేకుండా చేసిన పాపానికి మనం ఫలితం అనుభవిం చాల్సిందే. తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తరాది రాష్ట్రాలు జలప్రళయంతో విలవిల్లాడుతున్నాయి. నిజామాబాద్, మెదక్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో వరదలకు ప్రకృతి విధ్వంసం కారణమని గుర్తించాలి. ఇకపోతే క్లౌడ్ బరస్ట్‌తో కుంభవృష్టి కురుస్తోంది.ఉత్తరాదిలోని ఉత్తరాఖండ్ లోని రుద్రప్రయాగ్, చమోలీ జిల్లాల్లో కుంభవృష్టి అనేక గ్రామాలను ముంచెత్తుతోంది. ఉత్తరాఖండ్‌లో తాజాగా మరోసారి క్లౌడ్‌బర్స్ సభవించింది. అనేక చోట్ల ఇళ్లుకూలి అనేకమంది ప్రాణాలు కోల్పోయారు

## తలారి లక్ష్మన్న కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన మండల వీఆర్ఏలు

**తుగ్గలి:ఉదయం న్యూస్:**



మండల పరిధిలోని గల ఉప్పర్లపల్లి గ్రామం వీఆర్ఏ తలారి లక్ష్మన్న మృతి పట్ల తుగ్గలి మండలం వీఆర్ఏలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తలారీ లక్ష్మన్న కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ తుగ్గలి మండలం వీఆర్ఏల సంఘం తరపున 5000 రూపాయల ఆర్థిక సహాయంను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.గత 30 సంవత్సరాలుగా రెవెన్యూ శాఖ నందు ఉప్పర్లపల్లె గ్రామ వీఆర్ఏగా సేవలందించారని వారు ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో తుగ్గలి మండలం వీఆర్వోలు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత ప్రజాదరణ కలిగిన సీఎంలలో చంద్రబాబు కు మూడో స్థానం:

**అమరావతి, ఉదయం న్యూస్**



మూడ్ ఆఫ్ ద నేషన్ పేరిట ఇండియా టుడే సర్వేదేశంలోని 28 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల సీఎంల పనితీరుపై సర్వే.
ఈ సర్వేలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు ప్రథమ స్థానం.
మమతా బెనర్జీ, చంద్రబాబులకు వరుసగా రెండు, మూడు ర్యాంకులు.
దేశంలో అత్యంత ప్రజాదరణ కలిగిన సీఎంలలో చంద్రబాబు మూడో స్థానం దక్కించుకున్నారు. దేశంలోని 28 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల సీఎంల పనితీరుపై 'ఇండియా టుడే' సర్వే నిర్వహించింది. మూడ్ ఆఫ్ ద నేషన్ పేరిట నిర్వహించిన ఈ సర్వేలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ 36 శాతం జనామోదంతో ప్రథమ స్థానంలో నిలిస్తే.12.5 శాతంతో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ద్వితీయ స్థానంలో నిలిచారు. అలాగే చంద్రబాబు 7.3 శాతం జనామోదంతో మూడో స్థానంలో ఉన్నారు.
బిహార్ సీఎం 4.3 శాతం, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ 3.8 శాతం, వరుసగా నాలుగు, ఐదో స్థానాల్లో నిలిచారు. కాగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన ఇదే సర్వేలో చంద్రబాబు ఐదో స్థానంలో ఉన్నారు. ఇక, 'ఇండియా టుడే' 2001 నుంచి ఏడాదిలో రెండు సార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనితీరుపై 'మూడ్ ఆఫ్ ద నేషన్' పేరిట సర్వే నిర్వహిస్తూ ప్రజల అభిప్రాయాలను తెలుసు కుంటోంది.


## నిరు పేద కుటుంబంలో మెరిసిన ఆణిముత్యం

**తుగ్గలి:ఉదయం న్యూస్:**



తుగ్గలి మండలంలోని పై చింతలకొండ గ్రామంలో నివసిస్తున్న కొయలకొండ జయరాముని కుమారుడు రవికుమార్ మెగా డీఎస్సీ ఫలితాలలో సత్తా చాటాడు.నిరుపేద కుటుంబంలో జన్మించి వ్యవసాయ పనులకు వెళ్తూ శ్రద్ధగా చదువుకొని డీఎస్సీ నందు ప్రతిభ కనబరిచాడు.డీఎస్సీ ఫలితాలలో బయాలజీ నందు 78.8 మార్కులు సాధించి స్కూల్ అసిస్టెంట్ గా ఉద్యోగం సంపాదించాడు.నిరుపేద కుటుంబం జన్మించిన రవికుమార్ కు ఒక్కసారిగా ఉద్యోగం రావడంతో కుటుంబ సభ్యులు మరియు గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

## జూబ్లీహిల్స్ శాసనసభ్యుడు మాగంటి గోపీనాథ్ అకాల మరణం పట్ల



శాసనసభ తీవ్ర సంతాపం ప్రకటించింది

**హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్**

మాగంటి గోపీనాథ్ మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శాసనసభలో సంతాప తీర్మానం ప్రవేశపెడుతూ. ప్రజలకు వారందించిన సేవలు, వారితో ఉన్న వ్యక్తిగత అనుబంధాన్ని స్మరించుకున్నారు. సౌమ్యుడు, మితభాషి, ప్రజలతో వారికున్న సత్సంబంధాల వల్లే మూడుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. 2014 నేను రెండోసారి ఎమ్మెల్యేగా, మాగంటి గారు తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన సందర్భంలో శాసనసభలో వారితో కలిసి పని చేశాం. రాజకీయ విధానాల్లో మార్పు వచ్చినప్పటికీ వ్యక్తిగత మిత్రుత్వం, వ్యవహార శైలిలో ఎలాంటి మార్పు లేదు.
విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుకుగా ఉన్నారు. 1983 లో ఎన్ టీ రామారావు ప్రారంభించిన తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారు. 1985 నుంచి 95 వరకు తెలుగు యువత అధ్యక్షుడిగా, ఎన్టీఆర్ విశ్వాస పాత్రుడిగా పనిచేశారు.
హైదరాబాద్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ సభ్యుడిగా, వినియోగ దారుల ఫోరం సభ్యుడిగా సేవలు అందించడమే కాకుండా, సినీ నిర్మాతగా కూడా రాణించారు. 2014, 2018, 2023 మూడు సార్లు హ్యాట్రిక్ సాధించిన అతి తక్కువ మంది శాసనసభ్యుల్లో గోపీనాథ్ ఒకరు.
జూన్ 8 న గోపీనాథ్ అకాల మరణం వారి కుటుంబానికి తీరని దుఃఖాన్ని మిగిల్చింది. నగర ప్రజలకు, జూబ్లీహిల్స్ నియోజకవర్గం ప్రజలకు తీరని లోటు. శాసనసభ వారి కుటుంబానికి అండగా నిలబడుతుంది. గోపీనాథ్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం అని ముఖ్యమంత్రి సంతాప తీర్మానంలో పేర్కొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల పై సంచలన నిర్ణయం.!

**హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్**




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై సంచలన నిర్ణయం తీసుకుంది. రిజర్వేషన్ల కోటా పరిమితి ఎత్తివేస్తూ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది.
ఈ సంచలన నిర్ణయం ద్వారా 50% రిజర్వేషన్ సీలింగ్ కోటా పరిమితి ను, సడలించడాన్ని టార్గెట్ చేస్తోంది. ఈ దిశగా ప్రత్యేక జీవో గవర్నమెంట్ ఆర్డర్, జారీ చేయడానికి సిద్ధం అవుతోంది. తెలంగాణ ప్రభుత్వం 42% బీసీ రిజర్వేషన్ ను ప్రత్యేక జీవో ద్వారా అమలు చేయనుంది.
పంచాయతీ రాజ్ చట్టంలోని సెక్షన్ 285 ఏ, కు సవరణ:
పంచాయతీ రాజ్ చట్టంలోని సెక్షన్ 285 ఏ, లో సవరణలు చేయాలని కూడా తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది.ఈ సవరణతో బీసీ వర్గాలకు పంచాయతీ రాజ్ ఎన్నికలలో అధిక రిజర్వేషన్లు కల్పించే అవకాశం ఉంటుంది.ఈ సవరణ ద్వారా,బీసీ వర్గాలు ప్రాతినిధ్యం పెంచుకొని,వారికి మరింత స్థానం, అధిక అవకాశాలు కల్పించడానికి మద్దతు లభిస్తుంది.
రాష్ట్ర ప్రభుత్వం 50% సీలింగ్‌ను సడలించేందుకు చట్ట సవరణ బిల్లు ప్రవేశపెట్టే నిమిత్తం ప్రణాళికలు సిద్ధం చేసింది.దీనితో, రిజర్వేషన్ల కోటా పరిమితిని నెమ్మదిగా పెంచవచ్చు. ప్రస్తుతం దేశంలో ఉన్న 50% రిజర్వేషన్ సీలింగ్ పరిమితి ను, తొలగించడం ద్వారా, బీసీ,ఎస్సీ,ఎస్టీ వర్గాలకు మరిన్ని అవకాశాలు ఉండనున్నట్లు తెలుస్తోంది.ఆర్డినెన్స్‌కు ఆమోదం లభించకపోవడం:ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నప్పటికీ, ఆర్డినెన్స్ కు ఆమోదం లభించక పోవడంతో, జీవో గవర్నమెంట్ ఆర్డర్, ద్వారా ఈ నిర్ణయాన్ని అమలు చేయాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయించింది.ఈ జీవో ద్వారా, కొత్త రిజర్వేషన్ విధానాన్ని త్వరలో అమలు చేయనుంది. ఈ జీవో కోసం ప్రభుత్వ ఆమోదం ఇప్పటికే సిద్ధం అవుతోంది.ఈ జీవో అమలు చేయడం ద్వారా, తెలంగాణలో బీసీ వర్గాలకు విద్య, ఉద్యోగాలు,పంచాయతీ ఎన్నికలలో మరింత ప్రాతినిధ్యం ఉంటుంది.

## ఎమ్మెల్సీగా మాజీ ఇండియా క్రికెట్ కెప్టెన్ అజారుద్దీన్.?

**హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్**



గవర్నర్ కోటలో ఎమ్మెల్సీలుగా కోదండరాం అజారుద్దీన్ పేర్లను సిఫార్సును చేస్తూ తెలంగాణ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు తీర్పుతో కేబినెట్ మరోసారి గవర్నర్ కోట ఎమ్మెల్సీల పేర్లను సిఫార్సు చేసింది, అయితే కోదండరాం పేరుతో పాటు ఈసారి అమీర్ అలీ ఖాన్ స్థానంలో అజారుద్దీన్ కు స్థానం కల్పించింది, రేవంత్ సర్కార్, తెలంగాణ లోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక నిర్ణయం తీసుకుంది. షెడ్యూల్ ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్న ట్లు వెల్లడించింది. ఈ మేరకు లోకల్ బాడీ ఎలక్షన్స్‌కు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.
సెప్టెంబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని.. ఎన్నికల కమిషన్‌కు తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. అంతేకాకుండా..రిజర్వేషన్లలో సీలింగ్ క్యాప్ ఎత్తివేతకు తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. స్పెషల్ జీవోతో ఎన్నికలకు వెళ్లాలని డెసిషన్ తీసుకుంది. రిజర్వేషన్ల పరిమితిని ఎత్తేస్తూ అసెంబ్లీలో తీర్మానం చెయ్యాలని నిర్ణయం తీసుకుంది.
కాగా..ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమీర్ అలీఖాన్ ఎన్నికను రద్దు చేసింది సుప్రీంకోర్టు..అయితే, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ఎమ్మెల్సీగా అజహరుద్దీన్ ఎంపిక ఆసక్తికరరంగా మారింది.

## స్మశాన వాటికకు వెళ్లాలంటే... వంక దాటాల్సిందే.....!

**తుగ్గలి:ఉదయం న్యూస్:**



మండల పరిధిలోని గల ఉప్పర్లపల్లి గ్రామ ప్రజలు స్మశాన వాటికకు వెళ్లాలంటే ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని వంకను దాటి స్మశానని వాటికకు వెళ్ళాలి.శనివారం రోజున గ్రామ వీఆర్ఏ తలారి లక్ష్మన్న అంత్యక్రియలను నిర్వహించడానికి కుటుంబ సభ్యులు,గ్రామ ప్రజలు నీరు ప్రవహిస్తున్న వంకను దాటగడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని స్మశాన వాటికకు చేరుకున్నారు.వంక దాటే సమయంలో ఏ ప్రమాదం సంభవిస్తుందో అని గ్రామ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.చిట్ట చివరగా నిర్వహించే అంత్యక్రియలకు వంక వలన మహిళలు,చిన్నారులు దూరం అవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.చిట్టచివరిగా చేసే కార్యక్రమాలను కూడా కుటుంబ సభ్యులందరూ కలిసి నిర్వహించలేక పోతున్నామని గ్రామ ప్రజలు తెలియజేస్తున్నారు.అదేవిధంగా స్మశాన వాటికకు వెళ్లే దారి ముళ్ళ కంపలతో నిండిపోయిందని గ్రామ ప్రజలు తెలియజేస్తున్నారు.ఇప్పటికైనా మండల స్థాయి,గ్రామపంచాయతీ అధికారులు స్పందించి స్మశాన వాటిక ప్రత్యేక మార్గాన్ని ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కార మార్గాన్ని చూపాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా ఈ సమస్యపై పత్తికొండ శాసనసభ్యులు కే.ఈ శ్యాంబాబు చొరవ చూపాలని గ్రామ ప్రజలు కోరుచున్నారు.

## సెప్టెంబర్ 13న జాతీయ లోక్ ఆధాలాత్

**ఉదయం న్యూస్ అల్లూరి జిల్లా పాడేరు:ఆగస్టు 30:**



జాతీయ లోక్ ఆదాలత్ 13 సెప్టెంబర్ 2025, పాడేరు ప్రథమ శ్రేణి జ్యూడిషల్ కోర్ట్ నందు జాతీయ లోక్ అదాలత్ లో భాగంగా అధిక కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని పాడేరు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, ఏ. రాము గారు తెలిపారు. శనివారం స్థానిక కోర్ట్ ఆవరణంలో పాడేరు, హుకుంపేట, జీ మాడుగుల, పెద్దబయలు, ముంచంగి పుట్టు మండలాల పోలీసు అధికారులు మరియు న్యాయవాదులు తో సమావేశం అయ్యారు. ఈ కార్యక్రమం లో పాడేరు పోలీస్ స్టేషన్ సీఐ దీనభందు , పాడేరు ఎస్ఐ సురేష్, జిమాడుగుల ఎస్ ఐ షణ్ముఖ రావు, ముంచింగిపుట్టు ఎస్ ఐ రామకృష్ణ, పెదబయలు ఎస్ ఐ రమణ, హుకుంపేట ఎస్ ఐ సూర్యనారాయణ, పాడేరు పి%డ%ఇ ఎస్ ఐ లక్ష్మి న్యాయవాదులు, కోర్ట్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గున్నారు

## లాటరీ ద్వారా 12 బార్లు కేటాయింపు

**రాయచోటి, ఆగస్టు 30:**

**(ఉదయం ప్రతినిధి)**



ప్రభుత్వం నూతనంగా అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 11 ఓపెన్ బార్లకు మరియు ఒక రిజర్వ్‌డ్ బార్‌కు లాటరీ ద్వారా కేటాయింపు జరిపినట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో బార్ల కేటాయింపు లాటరీ డ్రా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ, మదనపల్లి డివిజన్‌లో మూడు బార్లు, రాయచోటిలో రెండు బార్లు, రాజంపేటలో రెండు బార్లు మరియు కల్లుగీత కార్మికులకు ఒక రిజర్వ్‌డ్ బార్ సహా మొత్తం 11 ఓపెన్ బార్లకు మరియు ఒక రిజర్వ్‌డ్ బార్‌కు లాటరీ ద్వారా కేటాయించామని వివరించారు. మదనపల్లిలో అంగజాల రాజన్న, బి. మనోహర్, బండారు నాగరాజులు, రాయచోటిలో దొండ్ల హర్ష వర్ధన్, పేరం ఇరగంరెడ్డి, రాజంపేటలో కె. సురేష్ కుమార్ నాయుడు, కె. సుబ్బయ్యలు, అలాగే కల్లుగీత కార్మికులకు రిజర్వ్‌డ్ బార్ కేటాయింపులో బి. కొత్తకోట బార్‌ను కుడుము ఆదిత్యకు లాటరీ డ్రా ద్వారా కేటాయించామని కలెక్టర్ తెలిపారు. మిగిలిన నాలుగు బార్లకు తగినన్ని దరఖాస్తులు రాకపోవడంతో లాటరీ నిర్వహించలేదని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి జి. మధుసూదన్, జోగేంద్ర, సిఐలు ఎల్లయ్య, గురుప్రసాద్, భీమలింగ, సుబ్బారెడ్డి, ఎక్సైజ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, %ాణవీ% తో పాటు దరఖాస్తుదారులు పాల్గొన్నారు.ప్రధానమంత్రి కుసుం కార్యక్రమ అమలుకు చర్యలను వేగవంతం చేయాలని జిల్లాలో చిన్న తరహా నీటిపారుదల ట్యాంకులను నింపడంలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. అమరావతిలోని సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్..... ప్రధానమంత్రి కుసుం, చిన్న తరహా నీటిపారుదల ట్యాంకుల నిర్వహణ, భూగర్భ జలాల పెంపుదల, వికలాంగ పింఛన్లు, బాలల సంరక్షణ సంస్థల ఏర్పాట్లు, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ కళ్యాణి, డిఆర్ఓ మధుసూదన్ రావు మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.... ప్రధానమంత్రి కుసుం కార్యక్రమంలో సోలార్ పవర్ యూనిట్లను ఏర్పాటు చేయబోయే కంపెనీలకు గుర్తించబడిన ప్రభుత్వ మరియు ప్రైవేటు భూములను త్వరగా అందజేయాలని దీనిపై పెండింగ్ పనులను పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలలో చిన్న తరహా నీటిపారుదల ట్యాంకుల నిర్వహణపై తగిన చర్యలు తీసుకోవాలని, బాలల సంరక్షణ సంస్థల ఏర్పాటు మరియు దానికి సంబంధించిన కమిటీల ఏర్పాటుపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వికలాంగ పింఛనులపై సమీక్షిస్తూ వికలాంగత్వం లేకపోయినా కొంతమంది పెన్షన్లు పొందుతున్నారని, అటువంటి అనర్హులను తొలగించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన సూచనల మేరకు సంబంధిత శాఖల వారు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పేదలకు సేవలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సెప్టెంబర్ 1వ తేదీన రాజంపేట మండలం బోయనపల్లి గ్రామంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు.కలెక్టర్, జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, సబ్ కలెక్టర్ భావన, టిడిపి ఇన్చార్జ్ జగన్మోహన్ రాజుతో కలిసి బోయనపల్లి గ్రామాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి హెలిపాడ్, ప్రజావేదిక, లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీకి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు జారీ చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అన్ని ఏర్పాట్లు శనివారం సాయంత్రానికి పూర్తిచేయాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేస్తున్నామని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టే విధంగా పథకం సిద్ధం చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

## కొలిమిగుండ్లలో పర్యటించిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి...

**కొలిమిగుండ్ల ఆగస్టు 30 (ఉదయం న్యూస్):**



కొలిమిగుండ్ల మండల కేంద్రంలో రోడ్ల భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శనివారం నాడు పర్యటించారు. కూటమి ప్రభుత్వంలో సూపర్ సిక్స్ పథకాలు విజయవంతం కావడంతో మహిళలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న విజయోత్సవ ర్యాలీలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గత వైసిపి ప్రభుత్వం లో కంటే కూటమి ప్రభుత్వంలోనే ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. అనంతరం రెండు కోట్ల రూపాయలతో రాంకో సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం వారు నిర్మించిన నూతన కళ్యాణ మండపాన్ని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శనివారం నాడు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో ప్రసాద్ రెడ్డి,మండల టిడిపి అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి, మూలే హుస్సేన్ రెడ్డి, వి ఆర్ లక్ష్మీ రెడ్డి, నంద్యాల రామేశ్వర్ రెడ్డి, నంద్యాల నారాయణరెడ్డి, పల్లె వెంకటేశ్వర్ రెడ్డి, వెన్నుపూస రామ చంద్రా రెడ్డి, గొంగటి హుసేన్ రెడ్డి, గొంగటి నారాయణరెడ్డి, సత్యం, కలవటాల కృష్ణ రంగారెడ్డి, భాస్కర్ రెడ్డి, పులి ప్రకాష్ రెడ్డి, అందే రాము, గూలి నాగేశ్వర్రెడ్డి, శ్రీనివాసులు, మంద విజయ్, బొట్టు స్వామి, రఘురామిరెడ్డి, తోట అమర్నాథ్ రెడ్డి, తోట నాగమల్లారెడ్డి, బాయికాటి బ్రదర్స్, కళ్యాణ్ రెడ్డి, విశ్వనాథరెడ్డి, ఇటిక్యాల శివారెడ్డి, జయలక్ష్మి రెడ్డి, కోటపాడు శివరామిరెడ్డి, కోటపాడు శివారెడ్డి, కమ్మవారిపల్లె వెంకటేశ్వరరావు, కత్తి రామదాసు, ఎర్రగుడి రాజగోపాల్, నిమ్మకాయల దస్తగిరి, లోకనాథరెడ్డి, దాసరి గోపాల్, మహిళా నాయకురాలు రమణమ్మ, ఇంకా తదితర నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉదయం న్యూస్
ఎడిటర్ : సి. శేఖర్ యం



# గణేష్ నవరాత్రి ఉత్సవాలకు పటిష్టమైన బందోబస్తు.!

పోలీస్ కమిషన్ డాక్టర్ బి. అనురాధ



వినాయక నిమజ్జన కార్యక్రమం ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని
జిల్లావ్యాప్తంగా 2750 పైచిలుకు గణపతి విగ్రహాల ప్రతిష్టాపన.
వినాయక మండపాన్ని జియో ట్యాగ్ పూర్తి చేయడం జరిగింది
వినాయక నవరాత్రి ఉత్సవాలకు పటిష్టమైన బందోబస్తుకు పోలీస్ శాఖ సిద్ధం.
వినాయక మండపాల ఆర్గనైజర్లు కార్యవర్గ సభ్యులు పోలీసులు సలహాలు సూచనలు తప్పకుండా పాటించాలి ప్రజలందరూ కలిసికట్టుగా ఉంటూ ఉత్సవాలను విజయవంతం చేద్దాం.
పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ.
ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. వినాయక నిమజ్జన కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు, ప్రతి వినాయక మండపాన్ని జియో టాకింగ్ చేయడం జరిగిందని తెలిపారు. మరియు గణేష్ నిమజ్జనం జరిగే రూట్ మ్యాప్ లో సీసీ కెమెరాల నిఘాలో ఉంచడం జరిగిందన్నారు. ప్రజలందరూ కలిసిమెలిసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రానున్న పండగలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ప్రజలందరూ, వినాయక మండపాల ఆర్గనైజర్లు ఉత్సవ కమిటీ మెంబర్లు, సంబంధిత కార్యవర్గ సభ్యులు, స్థానిక పోలీసుల సలహాలు సూచనలు పాటించాలని తెలిపారు. ప్రతి వినాయక మండపం వద్ద పాయింట్ బుక్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు, 24%శ%7 పోలీసు నిఘా ఉంటుందని తెలిపారు, స్థానిక పోలీసులు ప్రతిరోజు పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 24 గంటలు కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా సిసిటీవీ కెమెరాలను పర్యవేక్షిస్తూ సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా సోషల్ మీడియా నందు ఎలాంటి అసత్య ప్రచారాలు జరగకుండా సోషల్ మీడియా బృందం పర్యవేక్షిస్తుందని, ప్రజలను రెచ్చగొట్టేటువంటి అసత్యాలను ప్రచారం చేసిన వారిపై మరియు వాట్సాప్ గ్రూపు యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా జిల్లాలో చెరువులు కుంటలు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నందున నిమజ్జన సమయంలో తగు జాగ్రత్త ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా సంబంధిత వినాయక మండపాల ఆర్గనైజర్లు కార్యవర్గ సభ్యులు తగు జాగ్రత్త చర్యలు తీసుకుని నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేయాలని కమిషనర్ గారు సూచించారు.

# జర్నలిస్ట్ అక్రిడేషన్ కార్డుల గడువు పెంపు

ఉదయం న్యూస్ అల్లూరి జిల్లా పాడేరు, ఆగష్టు 30:



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని మరో మూడు నెలలు పాటు పొడిగిస్తున్నట్లు సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు శ్రీ హిమాన్షు శుక్ల శుక్రవారం ఆదేశాలు జారీ చేశారని, ప్రస్తుతం ఆగస్టు 31 వరకు అక్రిడిటేషన్ కార్డులు కలిగి ఉన్న పాత్రికేయులకు మాత్రమే మరో మూడు నెలలు, 1 సెప్టెంబర్, 2025 నుండి 30 నవంబర్, 2025 వరకు లేదా నూతన అక్రిడేషన్ కార్డులు జారీ చేసే ప్రక్రియ ఏది ముందు జరిగితే అప్పటివరకు పొడిగింపు ఉత్తర్వులు అమలులో ఉంటాయని సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు ఆదేశాలు జారీ చేశారని జిల్లా కలెక్టర్ మరియు డి ఎం ఏ సి చైర్మన్ జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు..
జిల్లాలో అక్రిడేషన్ సౌకర్యం కలిగి ఉన్న సంబంధిత యాజమాన్యాలు వారి సంస్థ పని చేస్తూ ప్రస్తుతం కొనసాగుతున్న వారి జాబితాను జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో అందజేసి పొడిగింపు స్టిక్కర్లు పొందగలరని కోరడమైనది.

# అనర్హులకు కూడా పెన్షన్ ఇమ్మని వైసిపి రాద్ధాంతం చేస్తుంది

**అర్హులైన వారు అప్లై చేసుకోవచ్చు కూటమి ప్రభుత్వం పారదర్శకంగా పెన్షన్లను అమలు చేస్తుంది**

**అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పెన్షన్ అందుతుంది**



బద్వేలు ఉదయం ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ లోని గ్రామ వార్డు సచివాలయాలలో వికలాంగుల సదరం సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ పూర్తయిందని శుక్రవారంనాడు బద్వేల్ నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ రితేష్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటనలో ఆయన తెలిపిన వివరాల ప్రకారం........ అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందుతుందని వికలాంగుల సదరం సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిందని పెన్షన్ తీసుకుంటున్న అనర్హుల పెన్షన్లు తొలగించబడ్డాయన్నారు. సదరం సర్టిఫికెట్లలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ గ్రామ వార్డు సచివాలయాలకు వెళ్లి పెన్షన్ అప్లై చేసుకోవాలని అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పెన్షన్ అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అనర్హుల ఏరివేతకే సదరం సర్టిఫికెట్ల పరిశీలన జరిగిందని దీనిపై ప్రతిపక్షాల రాద్ధాంతం చేస్తున్నాయని అనర్హులకు కూడా పెన్షన్ ఇవ్వమని ప్రతిపక్ష నాయకులు మాట్లాడడం చూస్తుంటే జగన్ రెడ్డి ప్రభుత్వంలో కొత్త పెన్షన్ల మంజూరు లో జరిగిన దందా ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం పారదర్శకంగా కొత్త పెన్షన్ల కల్పన, పెన్షన్ల పంపిణీ అమలు చేస్తుందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పెన్షన్ అందుతుందని ప్రతి ఒక్కరికి పెన్షన్ అందుతుంటే వైసీపీ నాయకులు కడుపు మంటతో విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు

# యూరియా కొరతపై బిఆర్ఎస్ నాయకుల మెరుపు ధర్నా..!

హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్



వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు మాజీ మంత్రులు శనివారం మెరుపు ధర్నా నిర్వహిం చారు. యూరియా కొరతపై ప్రభుత్వం స్పందించి ఇప్పటిలోగా పంపిణీ చేస్తారో చెప్పాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో యూరియా కొరతను నిరసిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆందోళనకు దిగారు.
అసెంబ్లీ నుంచి అగ్రికల్చర్ కమిషనరేట్‌కు ర్యాలీగా వెళ్లారు. వ్యవసాయ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆ తరువాత అగ్రికల్చర్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగిన కేటీఆర్, హరీశ్ రావు, నిరంజన్ రెడ్డితోపాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అరెస్టు చేశారు.
శనివారం తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. శాసనసభ వాయిదా అనంతరం హరీశ్ రావు, కేటీఆర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలతో కలిసి అసెంబ్లీ ఆవరణం నుంచి వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి యూరి యా కొరతను నిరసిస్తూ ర్యాలీగా వెళ్లారు. యూరి యా కొరతపై వ్యవసాయ శాఖ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు.
అనంతరం బయటకు వచ్చి యూరి కొరతను నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు, నేతలు ఆందోళనకు దిగారు. యూరియా కొరత ఎప్పుడు తీరుతుంది రైతులకు పూర్తిస్థాయిలో యూరియా ఎప్పుడు అందుబాటులోకి వస్తుంది వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించే వరకు ఇక్కడినుంచి కదలబోమని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. ఆందోళనలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా కోసం రైతులు రోడ్లెక్కి ఇబ్బంది పడుతుంటే ప్రభుత్వానికి కనిపించడం లేదా అంటూ ప్రశ్నించారు. ఆందోళన ఉధృతం కావడం తో పోలీసులు జోక్యం చేసు కొని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్ రావులతో పాటు పలువురిని అదుపు లోకి తీసుకున్నారు.

# తెలంగాణలో 2 లక్షల 20 వేల ఎకరాల్లో పంట నష్టం?

కామారెడ్డిలో 77 వేల ఎకరాలు

హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్




ఏ జిల్లాలో ఎంత నష్టం అంటే
తెలంగాణలో గత మూడు రోజులుగా అత్యంత భారీ వర్షాలు పడుతున్నాయి. గత మూడు రోజులుగా మెదక్, కామారెడ్డి,ఆదిలాబాద్,నిజామాద్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు పడుతున్నాయి.
జనజీవనం అస్తవ్యస్థమయ్యింది. వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు తెగిపోతున్నాయి. ఊర్లకు ఊర్లు మునిగిపోయాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయాయి. రోడ్లు కొట్టుకుపోయాయి. వేలాది ఎకరాల్లో పంట నష్టపోయింది.రైతులు తీవ్రంగా నష్టపోయారు.
భారీ వర్షాల కారణంగా పంట నష్టాలపై ఆగస్టు 29 ప్రాథమిక రిపోర్ట్ విడుదల చేసింది వాతావరణ శాఖ. ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలు రాష్ట్ర వ్యాప్తంగా పంటలకు తీవ్ర నష్టం కలిగించాయని తెలిపింది. వ్యవసాయ శాఖ విడుదల చేసిన ప్రాథమిక నివేదిక ప్రకారం మొత్తం 28 జిల్లాల్లో 2 లక్షల 20 వేల443 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా లక్షా 43 వేల 304 మంది రైతులు నష్టపోయారని వ్యవసాయశాఖ అంచనా వేసింది.
అత్యధికంగా కామారెడ్డి, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో పంటల నష్టం ఎక్కువగా నమోదైంది. కామారెడ్డి జిల్లాలోనే 77 వేల394 ఎకరాల పంటలు దెబ్బతిన్నాయి. మెదక్ జిల్లాలో 23 వేల169 ఎకరాలు, ఆదిలాబాద్‌లో 21 వేల276 ఎకరాలు, నిజామాబాద్‌లో 18 వేల 417 ఎకరాలు, కొమురం భీం ఆసిఫా బాద్ జిల్లాలో 15 వేల 317 ఎకరాల్లో పంటలు నష్టపోయాయి.
ఆ తర్వాత అత్యధికంగా నష్టపోయిన జిల్లాల్లో మంచిర్యాల,ఖమ్మం, నిర్మల్, సూర్యపేట, సిద్దిపేట సంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, గద్వాల ,పెద్దపల్లి, వనపర్తి, భూపాలపల్లి, మహబూబ్ నగర్ , ములుగు,సిరిసిల్లా, నాగర్ కర్నూల్, నల్గొండ, జగిత్యాల రంగారెడ్డి, కరీంనగర్, మేడ్చల్, జనగాం, యాదాద్రి భువనగిరి జిల్లాలు ఉన్నాయి.
జిల్లాల వారీగా చూస్తే వరి పంట అత్యధికంగా దెబ్బతింది. మొత్తం 1.09 లక్షల ఎకరాలు వరి నీట మునిగింది. పత్తి 60 వేల ఎకరాలు నష్టం చవిచూసింది. మెక్కజొన్న 16 వేల ఎకరాలు, వేరుశనగ 20వేల 900 ఎకరాల్లో దెబ్బతింది. సోయాబీన్, టమాట, మిర్చి, మినుములు, ఇతర హార్టికల్చర్ పంటలు కూడా గణనీయంగా దెబ్బతిన్నాయని తెలిపింది.



# ప్రజల మనసులో చెరగని ముద్ర “పరిటాల రవి”

విజయవాడ:: (ఉదయం న్యూస్)

గొల్లపూడి టీడీపీ కార్యాలయంలో దేవినేని ఉమామహేశ్వరావు నివాళులువిజయవాడ రూరల్ (గొల్లపూడి) ఆగస్టు 30, 2025: తెలుగుదేశం పార్టీ (టీడీపీ) దివంగత నేత, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర జయంతిని పురస్కరించుకొని గొల్లపూడిలోని టీడీపీ కార్యాలయంలో ఘనంగా నివాళి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరావు పరిటాల రవి చిత్రపటానికి పూలమాల వేసి, ఆయన రాజకీయ, సామాజిక సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని, పరిటాల రవి ఆదర్శాలను కొనియాడారు. ఈ క్రమంలో దేవినేని ఉమామహేశ్వరావు మాట్లాడుతూ, “పరిటాల రవి ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చి, అసామాన్య రాజకీయ నాయకుడిగా ఎదిగారు. ఆయన ఫ్యాక్షన్ హింసకు వ్యతిరేకంగా పోరాడి, ప్రజల హక్కుల కోసం అలుపెరగని కృషి చేశారు. ఆయన ఆదర్శాలు టీడీపీ కార్యకర్తలకు ఎల్లవేళలా స్ఫూర్తిగా నిలుస్తాయి” అని అన్నారు. పరిటాల రవి రాయలసీమలో సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటాన్ని, ఆయన చూపిన నీతి, నిజాయితీని కొనియాడారు. ఆయన ఆదర్శాలు పార్టీ కార్యకర్తలను ఉత్తేజపరుస్తాయని అభిప్రాయపడ్డారు.

**ప్రస్థానం... పోరాటం**

పరిటాల రవి 1958 ఆగస్టు 30న అనంతపురం జిల్లా పెనుకొండలో జన్మించారు. కమ్యూనిస్టు నేపథ్యం ఉన్న కుటుంబంలో పుట్టిన రవి, తన తండ్రి పరిటాల శ్రీరాములు హత్య తర్వాత రాయలసీమలో ఫ్యాక్షన్ హింసకు వ్యతిరేకంగా గట్టిగా నిలిచారు. 1993లో టీడీపీలో చేరిన ఆయన, 1994, 1999, 2004 ఎన్నికల్లో పెనుకొండ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. కార్మిక శాఖ మంత్రిగా ఆయన చేసిన సేవలు రాయలసీమ ప్రజలకు ఎనలేని గుర్తింపునిచ్చాయి. అయితే, 2005 జనవరి 24న ప్రత్యర్థుల దాడిలో ఆయన దురదృష్టవశాత్తూ హత్యకు గురయ్యారు. ఆయన మరణం తర్వాత భార్య పరిటాల సునీత రాజకీయ బాధ్యతలు స్వీకరించి, కూటమి ప్రభుత్వంలో రాప్తాడు ఎమ్మెల్యేగా సేవలు అందిస్తున్నారు.

# బద్వేలు కేంద్రంగా శ్రీ వీర వీరబ్రహ్మేంద్ర స్వామి జిల్లాను సాధిస్తాం

బద్వేలులో అన్ని సంఘాలు విద్యార్థులు భారీ ర్యాలీ

బద్వేలు ఉదయం ప్రతినిధి




వందల ఏ ల క్రితం కాలజ్ఞానాన్ని రచించి ఆనాడే బద్వేల్ బస్తి అవుతుందని తెలియజేసిన కలియుగ దైవం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కొలువైన ఉన్నటువంటి ప్రదేశంగానూ తెలుగులో అనువదించిన కవయిత్రి మెల్ల జన్మించిన ప్రదేశంగానూ సుమతి శతకం రచించిన మహాకవి బద్దెన నడియాడిన ప్రదేశం గానువేల కొలది అన్నదాత సత్రాలకు స్ఫూర్తిగా నిలిచిన అవధూత కాశిరెడ్డి నాయన కొలువై ఉన్నటువంటి ప్రదేశంగానూలంక మల్లేశ్వర స్వామి,మల్లెం కొండేశ్వర స్వామి, బద్వేల్ ప్రాంతం ప్రజల మరో తిరుపతిగా పేరుపొందిన లక్ష్మీపాలెం వెంకటేశ్వర స్వామి.... ఆధునిక దేవాలయాలు అయినటువంటి బ్రహ్మ సాగర్ బద్వేల్ పెద్ద చెరువు లాంటి జలాశయాలు కలిగిన ఈ ప్రాంతం సాంస్కృతికంగానూ వారసత్వ సంపదకుగాను కొలువై ఉన్నది....సెంచరీ ఫ్యాక్టరీ లాంటి పరిశ్రమ కలిగి ఉన్న ఈ ప్రాంతాన్ని జిల్లాగా ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రాముఖ్యతను దేశవ్యాప్తంగా తెలియజేయుటకు పాలకులు సంసిద్ధులు కావాలని ..అలాగే నెల్లూరు కర్నూలు ఒంగోలు జిల్లాలు సరిహద్దులు కలిగినటువంటి బద్వేల్ ప్రాంతం...
పరిశ్రమలు జిల్లా కార్యాలయాలు నిర్మించుటకు అనువైన ప్రాంతంగా బద్వేలు కలిగి ఉన్నది. ....చారిత్రికంగాను భౌగోళికంగానూ వారసత్వ సంపదను దృష్టిలో పెట్టుకొని బద్వేల్ ను కాలజ్ఞాని అయినా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి పేరుతో జిల్లాగా చేయవలెనని పాలకులను చేతులు జోడించి ప్రార్థిస్తున్నాను. .. అని ఈ సభాముఖంగా తెలియజేసుకుంటున్నాను...
వీరబ్రహ్మేంద్ర స్వామి జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో ఉద్యోగ ఉపాధ్యాయ బీసీ సాధన సమితి దళిత సాధన సమితి విద్యార్థి విభాగం బిజెపి కమ్యూనిస్టు పార్టీలు పెన్షనర్స్ విభాగం మేధావి వర్గాలు పాల్గొన్న మానవహారం విలేకరుల సమావేశంలో పై వారందరితోపాటు బద్వేల్ నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డి పాల్గొని ప్రసంగించి వీరబ్రహ్మేంద్రస్వామి జిల్లా సాధించుట కొరకు తన సంఘీభావాన్ని తెలిపారు

# సరూర్ నగర్ భర్త హత్య కేసులో వెలుగులోకి సంచలన విషయాలు..?

హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం



డంబెల్స్‌తో కొట్టి భర్తను చంపిన భార్య చిట్టి
కొద్దికాలం క్రితమే భార్య చిట్టికి పరిచయమైన ప్రియుడు హరీష్.
ఈ పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీయడంతో, భార్య చిట్టిని మందలించిన భర్త శేఖర్.
దీంతో భర్త అడ్డు తొలగించుకోవాలని పడుకున్నాక ప్రియుడు హరీష్‌ను ఇంటికి పిలిపించిన చిట్టి.
పడుకున్న శేఖర్ గొంతు నులిమిన హరీష్..భర్త ప్రతిఘటించడంతో డంబెల్స్‌తో తలపై కొట్టి చంపిన చిట్టి.
ఉదయం అవ్వగానే పోలీసులకు ఫోన్ చేసి, తన భర్త రాత్రి ఎవరితోనో గొడవ పడి వచ్చి పడుకున్నాడు. ఉదయం చనిపోయాడు అని చెప్పిన భార్య.
ఆమె తీరుతో అనుమానం వచ్చి విచారించగా, ఇద్దరం కలిసి చంపినట్లు ఒప్పుకున్న చిట్టి..
నాగర్ కర్నూల్ జిల్లా ఉర్కొండ మండలం మాదారం గ్రామానికి చెందిన శేఖర్‌తో చిట్టికి 2009లో వివాహం
వీరికి ఒక కూతురు, ఒక కుమారుడు. కూతురు హాస్టల్లో ఉంటూ చదువుకుంటుండగా, హత్య జరిగిన రోజు కుమారుడిని వినాయకుడి దగ్గర పడుకోమని పంపించిన చిట్టి.

# అల్లు కనక రత్నం మృతి పట్ల కడప టిడిపి అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి సంతాపం

బద్వేలు ఉదయం ప్రతినిధి



దివంగత నటుడు అల్లురామలింగయ్య సతీమణి, నిర్మాత అల్లు అరవింద్ మాతృమూర్తి కనకరత్నం మరణించటం ఎంతో బాధాకరం. హైదరాబాద్‌లోని వారి నివాసానికి వెళ్లి భౌతికాయానికి నివాళులు అర్పించిన టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, కడపజిల్లా టీడీపీ అధ్యక్షులు రెడ్డప్ప గారి శ్రీనువాసుల రెడ్డి
. ఈ సందర్భంగా అల్లు అరవింద్ అల్లు అర్జున్ని కలసి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# ఉల్లి రైతులకు ఊరట.. రూ.1,200కు కొనుగోలు..

ఏపీ: ఉల్లి రైతుల కోసం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. క్వింటాకు రూ.1200 చొప్పున చెల్లించి వెంటనే ఉల్లి కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు నష్టపోకుండా, వినియోగదారులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని, ధరల స్థిరీకరణ కోసం వేర్ హౌసింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు. రాష్ట్రంలో రైతు బజార్ల సంఖ్యను పెంచాలని, మార్కెట్ యార్డుల్లో ఆధునిక రైతు బజార్లు ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు.

క్వింటాకు రూ.1200 చెల్లించి రైతుల నుంచి ఉల్లిని తక్షణమే కొనుగోలు చేయాలని అధికారుల్ని ఆదేశించారు. అమరావతిలోని సచివాలయంలో రైతుల నుంచి ఉల్లి కొనుగోళ్లపై గురువారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.. ఉల్లి రైతుల పరిస్థితి, ఉల్లి ధరలపై ఆరా తీశారు. మహారాష్ట్రలో ఉల్లి పంటను ఎక్కువగా సాగు చేయడం.. పంట దెబ్బతిన్న కారణంగా ధరల విషయంలో రైతులు ఇబ్బందిపడుతున్నారని అధికారులు సీఎంకు వివరించారు. 'వచ్చే పది రోజుల్లో 5 వేల మెట్రిక్ టన్నుల ఉల్లి పంట వచ్చే అవకాశం ఉంది' అని అధికారులు తెలిపారు. ఇబ్బందుల్లో ఉన్న ఉల్లి రైతును ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు సీఎం చంద్రబాబు.



ఉల్లి రైతులకు నష్టం వాటిల్లకూడదు. క్వింటా ఉల్లిని రూ. 1200 చొప్పున కొనుగోలు చేయండి. తక్షణం కొనుగోళ్లు ప్రారంభించాలి. మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ నుంచి నష్టాన్ని భరించాలి. కమ్యూనిటీ హాళ్లల్లో అద్దెకు తీసుకుని ఆరబెట్టాలి. ఆరబెట్టిన ఉల్లిని రైతు బజార్లకు పంపిణీ చేయాలి. ఉల్లికి రేటు వచ్చేంత వరకూ కమ్యూనిటీ హాళ్లల్లో నిల్వ చేసుకునేందుకు రైతులకు అవకాశం కల్పించాలి. రైతు నష్టపోకూడదు.. వినియోగదారుడు ఇబ్బంది పడకూడదు. అన్ని పంటల ధరల స్థిరీకరణ కోసం వేర్ హౌసింగ్ సదుపాయం కల్పించాలి' అన్నారు చంద్రబాబు. 'రాష్ట్రంలోని రైతు బజార్ల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టాలి. ప్రస్తుతం ఉన్న రైతు బజార్ల సంఖ్యను పెంచాలి.. వీటిని 150 నుంచి 200 వరకూ చేసేలా ప్రణాళిక చేయాలి. రైతు బజార్లను నెక్స్ట్ లెవల్ కు తీసుకెళ్లాలి. మార్కెట్ యార్డుల్లోని 2-3 ఎకరాల భూమిని వినియోగించుకు ని కొత్తగా ఆధునిక రైతు బజార్లను ఏర్పాటు చేసేందు కు కార్యాచరణ చేపట్టాలి. మార్కెట్ యార్డుల్లో వేర్ హౌసింగ్, కోల్డ్ చైన్ లను కూడా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు చేయండి. రైతులకు, వినియోగదారులకు ఉపయోగపడేలా మార్కెట్ యార్డు స్థలాలు వినియోగించాలి. ధరల నియంత్రణకు.. ద్రవ్యోల్బణం పెరగకుండా ఈ చర్యలు ఉపకరిస్తాయి' అన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.



## సుగాలి ప్రీతి కేసులో సాక్ష్యాలు తారుమారు చేశారు..

ఏపీ: సుగాలి ప్రీతి కేసులో తాను చేసిన పోరాటాన్ని మర్చిపోవడం బాధకరం అన్నారు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ . సుగాలి ప్రీతి కేసులో తన పరిస్థితి పండ్లున్న చెట్టుకు రాళ్ల దెబ్బలా మారిందని వ్యాఖ్యానించారు. చేయూతను ఇచ్చిన వారిని తిట్టడం బాధాకరం అంటూ సుగాలి ప్రీతి తల్లి పార్వతి వ్యాఖ్యలపై విశాఖపట్నంలో జరుగుతున్న జనసేన పార్టీ సేనతో సేనాని కార్యక్రమంలో స్పందించారు. తాను గత ప్రభుత్వ హయాంలో సుగాలి ప్రీతి కేసుపై చేసిన పోరాటాన్ని గుర్తు చేసే ప్రయత్నం చేశారు.

'గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తికి ఎదురు మాట్లాడే ధైర్యం కూడా ఎవరికీ లేదు. ఒక మాజీ ముఖ్యమంత్రిని అరెస్టు చేస్తే కనీసం రోడ్ల మీదకు రావడానికి ఎవరూ సాహసించని పరిస్థితి. అలాంటి సమయంలో ఆ తల్లి ఆవేదన చూసి లక్షల మందితో కర్నూలు నడిబొడ్డుకు వెళ్లి బలంగా గళం వినిపించాను. ఆ పోరాట ఫలితంగా ఆ కేసును సీబీఐకి అప్పగిస్తూ అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. చట్టప్రకారం వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారాలు అందాయి. కర్నూలుకు 9 కిలోమీటర్ల దూరంలో దిన్నెదేవరపాడులో ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఇచ్చారు. అక్కడ ఎకరం విలువ సుమారు రూ.2 కోట్ల వరకూ మార్కెట్ విలువ ఉంటుందని అంటున్నారు. కర్నూలు నగరంలో భాగమైన కల్లూరు దగ్గర 5 సెంట్ల ఇంటి స్థలం, సుగాలీ ప్రీతి తండ్రికి రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇచ్చారు. రాజకీయపరంగా మనం తీసుకువచ్చిన ఒత్తిడి ఫలితమే ఇది' అన్నారు పవన్ కళ్యాణ్

'గత ప్రభుత్వం కేసును సీబీఐకి అప్పగిస్తూ జీవో జారీ చేసింది.. లెటర్ ఇచ్చి లాకర్లో పెట్టింది. నేను ఉపముఖ్యమంత్రి అయ్యాక సుగాలి ప్రీతి కేసుపై సీఐడీ చీఫ్ తో మాట్లాడి త్వరగా న్యాయం చేయాలని సూచించాను. డీజీపీ గారితో, హోంమంత్రి గారితో మాట్లాడాను. సీఐడీ విచారణ చేపట్టిన తర్వాత తేలిన అంశం.. అనుమానితుల డీఎన్ఏలు సరిపోలడం లేదు.. సాక్ష్యాలు తారుమారు చేశారు. గత ఐదేళ్లలో లా అండ్ ఆర్డర్ దారుణంగా దిగజారింది. అలాంటి పరిస్థితులు ప్రక్షాళన చేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం భుజాన వేసుకుంది. గత ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగానే కేసు విచారణకు ఇబ్బందులు కలుగుతున్నాయి. నా వరకు నేను సుగాలి ప్రీతి కేసులో దోషులకు శిక్ష పడాలి అని త్రికరణశుద్ధిగా కోరుకుంటున్నాను. ఇది ఒక్క సుగాలి ప్రీతి కేసుకు సంబంధించిన అంశం కాదు. బాలికల భద్రతకు సంబంధించిన అంశం' అన్నారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.

## రన్నింగ్ బస్సులో మంటలు..



విశాఖపట్నం: గురువారం రెండు వేర్వేరు అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్నాయి. కూర్మంపాలెం నుండి విజయనగరం వెళ్తున్న ఆర్టీసీ బస్సు శాంతిపురం జంక్షన్ వద్ద మంటల్లో చిక్కుకుంది. డ్రైవర్, కండక్టర్ అప్రమత్తతతో ప్రయాణికులందరూ సురక్షితంగా బయటపడ్డారు. మరో ఘటనలో, సింధియా హిమా చల్‌నగర్ ప్రాంతంలో పది రోజులుగా నిలిపి ఉంచిన కారు ఒక్కసారిగా దగ్ధమైంది. ఈ ప్రమాదాల లో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కారణాలు తెలియాల్సి ఉంది. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతి పురం జంక్షన్ దగ్గర ఓ పెట్రోల్ బంక్ ఎదురుగా ఆర్టీసీ రన్నింగ్ బస్సులో మంటలు చెలరేగాయి. బస్సులో నుంచి మంటలు రావడాన్ని వెనుక వస్తున్న ఆటో డ్రైవర్లు గమనించారు. వెంటనే డ్రైవర్ రమేష్‌ను అప్రమత్తం చేశారు.. ఆయన వెంటనే కండక్టర్ సాయికి విషయాన్ని చెప్పారు. డ్రైవర్ చాకచక్యంగా బస్సును అక్కడే రోడ్డుపై ఆపేశారు.. ఆ వెంటనే ప్రయాణికులు భయంతో బస్సులో నుంచి బయటకు పరుగులు తీశారు.. కొందరు బయటకు దూకేశారు.

అయితే ఈ ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 100మందికిపై పైగా ప్రయాణికులు ఉన్నట్లు కండక్టర్ చెబుతున్నారు. అక్కడ అందరూ చూస్తుండగానే నడిరోడ్డుపై బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఈ బస్సు కూర్మన్నపాలెం నుంచి విజయ నగరం వెళుతుండగా ఈ ఘటన జరిగింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదానికి కారణాలు ఏంటో తెలియాల్సి ఉంది. ఇంజిన్‌లో లోపంతో మంటలు చెలరేగాయా.. ఇతర కారణాలు ఏవైనా ఉన్నాయా అన్నది క్లారిటీ లేదు. మరోవైపు విశాఖపట్నం సింధియా హిమాచల్‌నగర్ ప్రాంతంలో.. పారిశ్రామిక ప్రాంతమైన జింక్ గేటు సమీపంలో కూడా కారు దగ్ధమైంది. గురువారం ఉదయం కారులో నుంచి మంటలు చెలరేగాయి. చూస్తుండగానే కారులో మంటలు వ్యాపించాయి.. అయితే కారులోని వారు వెంటనే అప్రమత్తమై బయటకు దూకేశారు. దీంతో వారు ప్రాణాలు దక్కించుకున్నారు. అందరూ చూస్తుండగానే కారు మొత్తం మంటలు చెలరేగాయి.. దీంతో స్థానికులు భయాందోళన చెందారు. వారు వెంటనే అలర్ట్ అయ్యారు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా.. వాళ్లు వచ్చేసరికి కారు సగానికిపైగా దగ్ధమైంది. పోలీసులు కూడా ఘటనా స్థలానికి చేరుకున్నారు.. ఈ ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

# సీనియర్ ఐఏఎస్ శ్రీలక్ష్మికి బిగ్ రిలీఫ్..

ఏపీ: సీనియర్ ఐఏఎస్ శ్రీలక్ష్మికి సుప్రీం కోర్టులో భారీ ఊరట దక్కింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆర్డర్‌పై సుప్రీం కోర్టు స్టే విధించింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో శ్రీలక్ష్మి పేరును తొలగిస్తూ గతంలో తెలంగాణ హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. అయితే తెలంగాణ హైకోర్టు ఆదేశాలను సీబీఐ అధికారులు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. కేసులో మరోసారి వాదనలు విని నిర్ణయం వెలువరించాలని తెలంగాణ హైకోర్టుకు సుప్రీంకోర్టు సూచించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో వాదనల అనంతరం ఇటీవల తెలంగాణ హైకోర్టు తీర్పు వెలువరించింది. శ్రీలక్ష్మీ పేరును తొలగించడం కుదరదని.. ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. తెలంగాణ హైకోర్టు తీర్పుపై శ్రీలక్ష్మీ సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. విచారణ చేపట్టిన జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ కోటీశ్వర్‌సింగ్ ధర్మాసనం తెలంగాణ హైకోర్టు ఆదేశాలపై స్టే ఇస్తూ ప్రతివాదులకు నోటీసులు ఇచ్చింది.

ఐఏఎస్ వై శ్రీలక్ష్మి ఓబుళాపురం మైనింగ్ కేసులో సీబీఐ కోర్టును ఆశ్రయించారు. 2022



అక్టోబరులో ఆమె దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌ను సీబీఐ కోర్టు కొట్టేసింది. ఆమె వెంటనే ఈ తీర్పును తెలంగాణ హైకోర్టులో సవాల్ చేశారు.. రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను అనుమతించిన తెలంగాణ హైకోర్టు శ్రీలక్ష్మిని ఓబుళాపురం కేసు నుంచి తప్పిస్తూ తీర్పు ఇచ్చింది. ఆ వెంటనే సీబీఐ తెలంగాణ హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టును ఆశ్రయించారు. సీబీఐ వాదనలు వినకుండా ఉత్తర్వులు ఇవ్వడం సరికాదని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ఇరుపక్షాల వాదనల్ని సుప్రీం కోర్టు పరిగణలోకి తీసుకుని.. ఈ పిటిషన్‌పై వాదనలు వినాలని హైకోర్టుకు తెలిపింది. మూడు నెలల్లో తేల్చాలని సూచించింది.. అయితే ఈ కేసులో శ్రీలక్ష్మి పేరును తొలగించడం కుదరదని తేల్చింది. మళ్లీ శ్రీలక్ష్మి సుప్రీంకోర్టుకు వెళ్లి తెలంగాణ హైకోర్టు తీర్పుపై తాజాగా స్టే తెచ్చుకున్నారు. మరోవైపు ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో గాలి జనార్దన్ రెడ్డికి ఊరట లభించింది. తెలంగాణ హైకోర్టు ఆయనకు, ఆయన పీఏ అలీఖాన్, బీవీ శ్రీనివాస్ రెడ్డి, రాజగోపాల్‌కు బెయిల్ మంజూరు చేసింది. నాంపల్లి సీబీఐ కోర్టు గతంలో వీరికి విధించిన 7 ఏళ్ల జైలు శిక్షను హైకోర్టు కొట్టివేసింది. అయితే, దేశం విడిచి వెళ్లకూడదని, రూ.10 లక్షల పూచీకత్తు సమర్పించాలని షరతు విధించింది. దాదాపు 15 ఏళ్లుగా నడుస్తున్న ఓబుళాపురం మైనింగ్ కేసులో విచారణ జరగ్గా.. నాంపల్లి కోర్టు తీర్పు వెలువరించింది. బి.వి.శ్రీనివాస రెడ్డి, గాలి జనార్దన్ రెడ్డి, వి.డి. రాజగోపాల్, మెఫజ్ అలీఖాన్లకు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధించింది. ప్రభుత్వ ఉద్యోగి అయిన రాజగోపాల్‌కు అదనంగా నాలుగు సంవత్సరాల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించింది.



## సెప్టెంబర్ 1న పింఛన్ డబ్బులు ఇవ్వరు..

ఏపీ: ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్లలో అనర్హులకు నోటీసులు జారీ చేసింది. అర్హులైన వారు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంది. సీఎస్ విజయానంద్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, అర్హులందరికీ పింఛన్లు అందేలా చూడాలని ఆదేశించారు. నోటీసులు అందుకున్నవారు వెంటనే అప్పీల్ చేసుకోవాలని, లేకుంటే పింఛన్ నిలిపివేస్తామని ప్రభుత్వం తెలిపింది. అప్పీల్ చేసుకున్నవారికి సెప్టెంబర్ 1న పింఛన్ అందుతుంది. చివరి తేదీ సమీపిస్తుండటంతో వెంటనే అప్పీల్ చేసుకోండి!

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగుల కోటాలో పింఛన్ తీసుకుంటున్నవారిలో అనర్హులకు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే నోటీసులు జారీ చేసిన వారిలో అర్హత ఉంటే కనుక మరోసారి అప్పీల్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ మేరకు సీఎస్ విజయానంద్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పింఛన్ల పంపిణీలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని ఆదేశించారు. ఎక్కడైనా ఫిర్యాదు వస్తే జిల్లా కలెక్టర్లే బాధ్యత వహించాలని సూచించారు. పింఛన్ల పంపిణీలో జిల్లా కలెక్టర్ల నుంచి మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొనాలని విజయానంద్ అన్నారు. పింఛన్ల తనిఖీలో భాగంగా 1.35 లక్షల మందికి నోటీసులు ఇచ్చామని. వీరిలో.88,319 మంది ఎంపీడీవోలకు అప్పీలు చేసుకున్నారని.. ఇంకా 23 వేల మంది అప్పీలు చేసుకోలేదన్నారు. పింఛన్లకు సంబంధించిన సమస్యల్ని నెల రోజుల్లో పరిష్కరించాలని సీఎస్ ఆదేశించారు.

ఇదిలా ఉంటే దివ్యాంగుల కోటాలో పింఛన్ రద్దు నోటీసులు అందుకున్నవారు వెంటనే అప్పీల్ చేసుకోవాలని ప్రభుత్వం సూచిస్తోంది. ఇలా అప్పీల్ చేసుకున్నవారందరికి సెప్టెంబర్ 1న పింఛన్ అంజేస్తారు. ఎవరైతే అప్పీల్ చేసుకోరో వారి పింఛన్ నిలిపివేస్తారు. కాబట్టి నోటీసులు అందుకున్నవారు వెంటనే దగ్గరలోని ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లు, మున్సిపాలిటీ పరిధిలో అధికారులకు అప్పీల్ చేసుకోవాలని సూచిస్తున్నారు. ఒకవేళ అప్పీల్ చేసుకోకపోతే సెప్టెంబర్ 1 నుంచి పింఛన్ నిలిపివేస్తారు. అయితే పింఛన్ రద్దు నోటీసులు అందుకున్న వారిలో ఇప్పటికి 80% అప్పీల్ చేసుకున్నారని.. మిగిలిన 20%మంది ఈ నెల 29-8-2025 సాయంత్రం లోపల అప్పీల్ చేసుకోవాలని సూచించారు. ఆఫ్‌లైన్‌లో అప్పీల్ చేసుకునేందుకు ఈ నెల 29 సాయంత్రం 5 గంటల వరకు అవకాశం ఉంది. అదే ఆన్‌లైన్‌లో అయితే ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సమయం ఉంది. ఈ విషయాన్ని గమనించి అప్పీల్ చేసుకోవాలని సూచిస్తున్నారు. ఏవైనా అనుమానాలు ఉంటే దగ్గరలోని సచివాలయంలో సంప్రదించాలి.. ఈ నెల 30లోగా అప్పీల్ చేసుకోవడం మర్చిపోవద్దు.

పింఛన్ రద్దు నోటీసులు అందుకున్న వారు ఎంపీడీవోకు అప్పీల్ చేసుకుంటూ ఒక లేఖ రాయాలి.. ఆధార్ కార్డు, రేషన్ కార్డు కాపీలు.. పింఛన్ రద్దు/పింఛన్ మార్పు నోటీసు.. సదరం సర్టిఫికేట్ (పాతది).. సదరం సర్టిఫికేట్ (కొత్తది) ఉండాలి. అలాగే పింఛన్ లబ్ధిదారులకు సంబంధించిన ఏవైనా హాస్పిటల్ చికిత్స పొందిన/పొందుతున్న డాక్యుమెంట్స్ ఏవైనా ఉంటే కూడా సమర్పించాలి. అప్పీల్ చేసుకున్నవారికి ఎంపీడీవో కు నోటీసు జారీ చేస్తారు. అప్పుడు పింఛన్ లబ్ధిదారులు మరొకసారి కొరకు హాజరవుతారు. అయితే ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. అప్పీల్ చేసుకున్నవారికి ప్రభుత్వం సెప్టెంబర్ 1న పింఛన్ ఇవ్వాలని నిర్ణయించింది. ఆ తర్వాతే ఉంటుందని చెబుతున్నారు. అలాగే దివ్యాంగుల కోటాలో నోటీసులు అందుకున్న వారిలో వితంతు పింఛన్‌కు అర్హులైన వారిని ఆ కేటగిరిలోకి మార్చేశారు.

# సమాధి కోసం ముందుగానే శ్మశానంలో స్థలం రిజర్వేషన్..

కడప: ఓ వింత ఆచారం నడుస్తోంది. భార్యాభర్తలు మరణించిన తర్వాత కూడా కలిసి ఉండాలనే ఉద్దేశంతో సమాధి స్థలాన్ని ముందుగానే రిజర్వ్ చేసుకుంటున్నారు. రిమ్స్ దగ్గర క్రైస్తవుల సమాధి తోటలో ఈ ఆచారం ఎక్కువగా కనిపిస్తోంది. భార్య చనిపోతే భర్త, భర్త చనిపోతే భార్య తమ సమాధి పక్కనే స్థలం రిజర్వ్ చేసుకుని బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఆసక్తికరమైన ఆచారం స్థానికంగా చర్చనీయాంశమైంది.

శ్మశానంలో రిజర్వేషన్ ఏంటి.. ఇదేదో వింతగా ఉందే అనుకుంటున్నారా.. అక్కడ శ్మశానంలో చనిపోయిన తర్వాత సమాధి కట్టేందుకు ముందుగానే స్థలం రిజర్వ్ చేసుకుంటున్నారట. ఇదేం విచిత్రం అనుకోకండి.. శ్మశానంలో ఇలా స్థలాన్ని ముందుగానే రిజర్వ్ చేసుకోవడం వెనుక ఓ కారణం కూడా ఉందట. కడపలో ఈ విభిన్నమైన పద్ధతిని పాటిస్తున్నారట. ఎంతో పవిత్రమైన భార్యాభర్తల బంధానికి గుర్తుగా.. మరణం తర్వాత కూడా పక్క, పక్కనే ఉండాలనే ఆకాంక్షతోనే ఇలా చేస్తున్నారట. అందుకే ముందుగానే సమాధికి అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటున్నారట.కడపలోని రిమ్స్‌కు దగ్గరలో క్రైస్తవుల సమాధి తోట ఉంది. అక్కడ సమాధుల పక్కన అక్కడక్కడా రిజర్వ్ చేసినట్లుగా బోర్డుల్ని ఏర్పాటు చేశారు. రిజర్వేషన్ చేసినట్లుగా బోర్డుల్ని చూసిన కొందరు అసలు అక్కడ ఏం జరుగుతుందని ఆరా తీశారట. అప్పుడు ఈ ముందస్తు రిజర్వేషన్ అంశం తెలిసిందట. ఆ ప్రాంతంలో భర్త చనిపోతే భార్య శ్మశానంలో ముందుగానే భర్త సమాధి పక్కనే స్థలం రిజర్వ్ చేసుకుంటున్నారట. ఒకవేళ భార్య చనిపోతే భర్త కూడా ఇలాగే చేస్తున్నారట. ఇలా స్థలం రిజర్వేషన్ చేసుకున్న చోట బోర్డులు ఏర్పాటు చేస్తున్నారట. కడపలో ఇలా భార్యభర్తలు శ్మశానంలో వారి సమాధికి ముందుగానే అవసరమైన స్థలాన్ని ఇలా రిజర్వేష న్ చేసుకుంటున్నారట. మరణం తర్వాత కూడా ఇలా పక్క, పక్కనే సమాధులు ఉండేలా ముందే ఏర్పాట్లు చేసుకుంటున్నారట. ప్రతి రోజూ భార్యాభర్తలు గొడవలు పడి విడిపోయే ఈ కాలంలో కూడా.. ఇలా భార్యాభర్తలు చనిపోయిన తర్వాత కూడా కలిసి ఉండాలనే ఉద్దేశంతో పాటిస్తున్న ఈ పద్ధతి గురించి అందరూ చర్చించుకుంటున్నారు.

# ఎట్టకేలకు ప్రమోషన్లు దక్కాయి.. 20 ఏళ్ల కల నెరవేరింది..

ఏపీ: ప్రభుత్వం వైద్యారోగ్య శాఖలో 63 మంది అసోసియేట్ ప్రొఫెసర్లను ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించింది, నిబంధనలను సడలించి తక్కువ అనుభవం ఉన్నా అవకాశం ఇచ్చింది. అలాగే పశు సంవర్ధక శాఖలో కూడా 17 మంది డిప్యూటీ డైరెక్టర్లకు జాయింట్ డైరెక్టర్లుగా పదోన్నతులు లభించాయి. వైద్యారోగ్య శాఖ అడ్మినిస్ట్రేషన్ వింగ్‌లో ఏడుగురు డిప్యూటీ డైరెక్టర్లకు జాయింట్ డైరెక్టర్లుగా ప్రమోషన్లు దక్కాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న 63 మంది అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతి లభించింది. ప్రభుత్వం నిబంధనలను సడలించి, తక్కువ అనుభవం ఉన్నా పదోన్నతి కల్పించింది. వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఈ విషయాన్ని గురువారం తెలిపారు. మూడేళ్ల నిబంధనను సడలించి, ఒక ఏడాది అనుభవం ఉన్నా పదోన్నతికి అర్హులుగా పరిగణించారు. మొత్తం 11 క్లినికల్, 2 నాన్-క్లినికల్ విభాగాల్లో పదోన్నతుల కమిటీ సిఫార్సు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

ముఖ్యమంత్రి ఆమోదంతో ఎన్ఎంసీ నిబంధనల మేరకు 74 మందికి పదోన్నతి



కల్పించడానికి నిబంధనలు సడలిస్తే.. అందులో 63 మందికి ప్రమోషన్లు దక్కినట్లు మంత్రి సత్యకుమార్ తెలిపారు. ప్రమోషన్లు దక్కిన వారు కొత్త, పాత ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పనిచేయడానికి ఒప్పుకోవడంతో పోస్టింగ్‌లు ఇచ్చినట్లు ప్రకటించారు. వైద్యారోగ్య శాఖలో 11 నుంచి 20 ఏళ్లుగా ప్రమోషన్ల కోసం ఎదురు చూస్తున్న ఏడుగురికి, డ్రగ్ కంట్రోల్ విభాగంలో ఇద్దరికి జేడీలుగా పదోన్నతి కల్పించామన్నారు. చాలా కాలంగా ఎదురు చూస్తున్నవారికి కూడా ప్రమోషనల్లు దక్కాయి. పశు సంవర్ధక శాఖలో ఈ ప్రమోషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. 17 మంది డిప్యూటీ డైరెక్టర్లను (డీడీలు) జాయింట్ డైరెక్టర్లుగా (జేడీలు) ప్రమోషన్లు దక్కాయి. మరోవైపు ముగ్గురు అసిస్టెంట్ డైరెక్టర్లకు (ఏడీలు) డీడీలుగా తాత్కాలిక ప్రమోషన్ లభించింది. ఇంకా 30 మంది కి పైగా ఏడీలకు డీడీలుగా ప్రమోషన్లు కల్పించేందుకు ప్రభుత్వం ప్రతిపాదనల్ని పరిశీలిస్తోంది. మరో వారం, పది రోజుల్లో ప్రమోషన్లు దక్కినవారికి పోస్టింగులు ఇస్తారు. వైద్యారోగ్య శాఖ అడ్మినిస్ట్రేషన్ వింగ్‌లో ఏడుగురు డిప్యూటీ డైరెక్టర్లకు ప్రమోషన్లు దక్కాయి. వారిని జాయింట్ డైరెక్టర్లుగా నియమించారు.. శాఖాపరమైన పదోన్నతుల కమిటీ సిఫారసు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రమోషన్లు దక్కిన వారిలో బి రాజశేఖర్‌రెడ్డి (జీజీహెచ్- శ్రీకాకు ళం), ఎం.మంజుల (డీపీహెచ్- విజయవాడ), కె.శ్యామల, డి.ప్రకాశరావు (ఎన్‌హెచ్‌ఎం-మంగళగిరి), వి.వి.శేషారెడ్డి (ఎన్‌యూహెచ్ఎం-మంగళగిరి), కె.అప్పారావు (ఎన్టీఆర్ వైద్యసేవ-మంగళగిరి), జి.శ్రీనివాసులు (ఆర్‌డీఎంహెచ్ ఎస్- గుంటూరు)లు ఉన్నారు. డ్రగ్ కంట్రోల్ వింగ్‌లో అసిస్టెంట్ డైరెక్టర్ల నుంచి డిప్యూటీ డైరెక్టర్లుగా ప్రభుత్వం ప్రమోషన్లు ఇచ్చింది.

# 30 రోజుల్లో కచ్చితంగా రిజిస్ట్రేషన్ చేసుకోండి

ఏపీ: స్థిరాస్తి వ్యాపారం చేసేవారు, ఏజెంట్లు తప్పనిసరిగా ఏపీరెరా (ఆంధ్రప్రదేశ్ స్థిరాస్తి వ్యాపార ప్రాధికార సంస్థ)లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రెరా ఛైర్మన్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ సురేష్ కుమార్ తెలిపారు. 30 రోజుల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెరా చట్టంలోని సెక్షన్ 9 ప్రకారం రిజిస్ట్రేషన్ తప్పనిసరి అన్నారు. రెరా చట్టంలోని సెక్షన్ 9 ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి కాబట్టి స్థిరాస్తి వ్యాపారం చేసేవారు, ఏజెంట్లు విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇప్పటివరకు కేవలం 248 మంది ఏజెంట్లు మాత్రమే తమ వివరాలు నమోదు చేసుకున్నారని.. మిగిలిన వారు వెంటనే నమోదు చేసుకోవాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే భారీ జరిమానాలు, వ్యాపార కార్యకలాపాలపై నిషేధం విధిస్తామని హెచ్చరిం చారు. రెరా అనుమతులు లేని ఏజెంట్ల ద్వారా ఇళ్లు, స్థలాలు కొనొద్దని ప్రజలకు సూచించారు. ఇలాంటి లావాదేవీలకు రెరా చట్టం వర్తించదన్నారు. ఒకవేళ రిజిస్ట్రేషన్ విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే.. రెరా కార్యాలయం లోని హెల్ప్‌లైన్ నంబరు 63049 06011కు కాల్ చేసి సంప్రదించాలని సూచించారు. ఈ నంబర్ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5:30 వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

# అనారోగ్య సమస్యతో బాధపడుతున్న స్మితా సబర్వాల్..

తెలంగాణ: సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ స్మితా సబర్వాల్ చేసిన పోస్ట్ ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జీవితంలో గడ్డు పరిస్థితులు ఎదుర్కొన్నానని.. ఇప్పుడిప్పుడే నెమ్మదిగా వాటి నుంచి కోలుకుంటున్నాను అంటూ ఆమె చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. ఇదిలా ఉంటే స్మితా సబర్వాల్ ఆరు నెలలు అనగా సెప్టెంబర్ 1 నుంచి 2026 జనవరి 31 వరకు సెలవు తీసుకున్నారు. చైల్డ్ కేర్ లీవ్ తీసుకుంటున్నట్లు ప్రకటించారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు మీ కోసం..

సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ గురించి రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వంలో స్మితా సబర్వాల్ కు అద్భుతమైన పరిపాలనా అవకాశం లభించింది. తన పనితీరుతో ఎంతో గుర్తింపు తెచ్చుకున్నారు. విధి నిర్వహణలోనే కాక సోషల్ మీడియాలో కూడా ఆమె చాలా యాక్టీవ్‌గా ఉంటారు. అప్పుడప్పుడు వివాదాస్పద వ్యాఖ్యలు, బోల్డ్ స్టేట్‌మెంట్స్ పోస్ట్ చేస్తూ.. వార్తల్లో నిలుస్తుంటారు. ఇక తాజాగా మరోసారి స్మితా సబర్వాల్ పేరు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. కారణం ఆమె చేసిన ఓ పోస్ట్.

తాజాగా స్మితా సబర్వాల్ ఎక్స్ వేదికగా ఒక ఆసక్తికర పోస్ట్ చేశారు. కొన్ని గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నానని.. కానీ ప్రస్తుతం తాను వాటి నుంచి నెమ్మదిగా బయటపడగలుగుతున్నాను అంటూ చెప్పుకొచ్చారు. తన పోస్ట్‌లో స్మితా సబర్వాల్.. 'కొన్ని సార్లు మన జీవితాల్లో చాలా ప్రశాంతంగా ఉన్న సమయాలు.. మనకు చాలా గట్టి సమాధానాలు చెబుతాయి. నా వ్యక్తిగత విషయాలకు వస్తే.. అనారోగ్య సమస్య వెలుగులోకి వచ్చింది. మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే ప్రధాన రక్తనాళమైన కశేరుక ధమనిలో చీలిక వచ్చిందని తెలిసి నా ప్రపంచం ఒక్కసారిగా షేక్ అయ్యింది. ఈ బాధాకరమైన విషయాల నుంచి నెమ్మదిగా కోలుకుంటున్నాను. చాలా కష్టంగా ఉన్నప్పటికీ... నేను కోలుకుంటు న్నాను. ప్రతిరోజు ఎంతో కొంత మనో ధైర్యాన్ని



అలవర్చుకుంటున్నాను' అని ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఈపోస్ట్ నెట్టింట తెగ వైరలవుతుంది.

ఈ పోస్ట్ చూసిన నెటిజనులు.. మీకు ఏం జరిగిందో మాకు తెలియదు కానీ.. మీరు మాత్రం త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాము మేడం అంటూ కామెంట్స్ చేస్తున్నారు. వారందరికి స్మితా సబర్వాల్ ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం స్మితా సబర్వాల్ వెకేషన్ కోసం విదేశాలకు వెళ్లినట్లుగా తెలుస్తోంది. ఇదిలా ఉంటే స్మితా సబర్వాల్ లాంగ్ లీవ్ పెట్టిన సంగతి తెలిసిందే.

వచ్చే నెల అనగా సెప్టెంబర్ 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది అంటే 2026, జనవరి 31వ తేదీ వరకు ఆమె ఆరు నెలలు సెలవులు తీసుకున్నారు. ప్రస్తుతం స్మితా సబర్వాల్ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ మెంబర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ ఆరు నెలలు ఆమె చైల్డ్ కేర్ లీవ్ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇదిలా ఉంటే స్మితా సబర్వాల్‌కు వచ్చిన అనారోగ్య సమస్య ఏంటి.. దాని లక్షణాలు ఎలా ఉంటాయి..

## తెలంగాణకు మరో కొత్త రైల్వే ప్రాజెక్ట్..

తెలంగాణ: తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం భారీ శుభవార్త చెప్పింది. రాష్ట్రానికి కొత్త రైల్వే ప్రాజెక్ట్‌ను మంజూరు చేసింది. దీని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సుమారు 5 వేల కోట్ల రూపాయలకు పైగా నిధులు కేటాయించ నుంది. ఈ రైల్వే లైన్‌కు మరో ప్రాముఖ్యత కూడా ఉంది. రాష్ట్రం నుంచి మొదటిసారిగా 4లైన్ల ఇంటర్ స్టేట్ రైలు మార్గంగా ఇది నిలవనుంది. ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం ఢిల్లీలో జరిగిన కేంద్ర మంత్రి వర్గం సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ సహా ఐదు రాష్ట్రాలకు లబ్ధి చేకూర్చేలా.. రూ.12,328 కోట్ల విలువైన 4 కొత్త రైల్వే ప్రాజెక్ట్‌లకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.



కేంద్రం ఆమోదించిన నాలుగు రైల్వే ప్రాజెక్టుల్లో తెలంగాణకు సంబంధించి సికింద్రాబాద్-వాడి మార్గం కూడా ఉంది. ఈ రెండు ప్రాంతాల మధ్య మల్టీ ట్రాకింగ్ నిర్మించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. రానున్న 5 సంవత్సరాల్లో ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. రూ.5,102 కోట్లతో ఈ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టనున్నారు. వచ్చే సంవత్సరం అనగా 2026 కేంద్ర బడ్జెట్‌లో దీనికి నిధులు కేటాయించనున్నారు. మరో ఐదు సంవత్సరాల్లో దీన్ని పూర్తి చేయాలని కేంద్రం భావిస్తుంది.

ప్రస్తుతం సికింద్రాబాద్(సనత్‌నగర్)-వాడి మధ్య డబుల్ ట్రాక్ ఉంది. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో 3, 4వ మార్గం పనులు మొదలుపెట్టనున్నారు. ఇది పూర్తయ్యి అందుబాటులోకి వస్తే.. తెలంగాణ నుంచి ముంబై ప్రయాణించే రైళ్లు వేగంగా గమ్యస్థానాలకు చేరడమే కాక.. మరికొన్ని కొత్త రైళ్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది అంటున్నారు. సికింద్రాబాద్-వాడి మార్గం ఎక్కువ రద్దీ ఉండే రూట్లలో ఒకటి. ఈ మార్గంలో సికింద్రాబాద్ నుంచి పుణెకు వెళ్లే శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌తో పాటుగా.. ముంబై వెళ్లే హుస్సేన్‌సాగర్, ఎల్‌టీటీ ముంబయి వంటి ట్రైన్స్ వికారాబాద్-వాడి మార్గంలో ప్రయాణాలు సాగిస్తుంటాయి.

ఈ మార్గం కిటకిటలాడుతూ ఉంటుంది. ఇక ఈ రూట్లో.. ఎక్కువ సిమెంట్ ఇండస్ట్రీ లున్నాయి. అలానే ఈ మార్గంలో వేర్వేరు ప్రాంతాలకు సిమెంట్, స్టీల్‌తో పాటుగా వ్యవసాయ ఉత్పత్తులు కూడా రవాణా అవుతుంటాయి. ఈ రూట్ మొత్తం మీద 173 కి.మీ. మేర నాలుగు లైన్లుగా చేయనున్నారు. కర్ణాటకలో 49 కిమీ, తెలంగాణలో 124 ఉంది. ఇది అందుబాటు లోకి వస్తే.. రద్దీ తగ్గడమే కాక మరిన్ని కొత్త రైళ్ల సంఖ్య పెరుగుతుంది అంటున్నారు. రైల్వేల అభివృద్ధి విషయం లో మోదీ సర్కార్ అన్ని విధాలుగా సహకరిస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.

## బిగ్‌బాస్ కంటెస్టెంట్ లోబోకు జైలు శిక్ష..

జనగామ: ఏడేళ్ల నాటి కేసులో టీవీ నటుడు, బిగ్‌బాస్ కంటెస్టెంట్, యాంకర్ లోబోకు గట్టి షాక్ తగిలింది. అతడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించింది. అలానే రూ.12,500లు జరిమానా కూడా విధించింది. ఇంతకు ఏ కేసులో కోర్టు లోబోకు జైలు శిక్ష విధించింది అంటే.. ఏడు సంవత్సరాల క్రితం జరిగిన ఓ యాక్సిడెంట్ కేసులో ఈ తీర్పు వెల్లడయ్యింది. తన కారులో వరంగల్ నుంచి హైదరాబాద్ వస్తున్న లోబో.. రఘునాథపల్లి మండలం వద్ద ఓ ఆటోను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరు మరణించగా.. కొందరికి గాయాలయ్యాయి. నాడు నమోదైన కేసులో తాజాగా లోబోకు కోర్టు శిక్ష విధించింది. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మరణించడమే కాక మరికొందరు గాయపడటానికి కారణమైన లోబోకు జనగామ కోర్టు సంవత్సరం జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించింది.



జనగామ జిల్లా రఘునాథపల్లి సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌ఐలు తెలిపిన వివరాల ప్రకారం.. ఏడు సంవత్సరాల క్రితం అనగా.. 2018, మే 21న లోబో ఓ టీవీ ఛానల్ కార్యక్రమం కోసం వీడియో షూట్ చేయడానికి గాను.. తన టీమ్‌తో కలిసి వరంగల్ జిల్లాలోని లక్నవరం, భద్రకాళి చెరువు, రామప్ప, వేయిస్తంభాల ఆలయం వంటి ప్రాంతాల్లో పర్యటించారు. ఆ తర్వాత వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ సమయంలో లోబోనే స్వయంగా కారు నడిపారు. ఈక్రమంలో లోబో కారు డ్రైవ్ చేస్తూ హైదరాబాద్‌కు వస్తుండగా.. రఘునాథపల్లి మండలం నిడిగొండ వద్ద యాక్సిడెంట్ జరిగింది. లోబో తన కారుకు ఎదురుగా వచ్చిన ఓ ఆటోను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో మేడె కుమార్, పెంబర్తి మణెమ్మలు అనే ఇద్దరు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూనే చనిపోయారు. అలానే ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న మరి కొందరికి గాయాలయ్యాయి. ఈ ఘటనలో లోబో, అతడి టీమ్ ప్రయాణిస్తున్న కారు కూడా బోల్తా పడింది. దీంతో వారికి కూడా స్వల్ప గాయాలయ్యాయి.

ఈప్రమాదం గురించి మృతుల కుటుంబ సభ్యుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి రఘునాథపల్లి పోలీసులు లోబోపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో తాజాగా జనగామ కోర్టు తీర్పు వెల్లడించింది. యాక్సిడెంట్ చేసి ఇద్దరి మృతికి కారణమైనందుకు గాను లోబోకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.12,500 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించిందని.. పోలీసులు తెలిపారు. మరి దీనిపై లోబో రియాక్షన్ ఎలా ఉంటుందో చూడాలి.

## సెప్టెంబర్ 1న రేషన్ షాపులు బంద్

తెలంగాణ: రేషన్ డీలర్లు ప్రభుత్వానికి షాక్ ఇచ్చేందుకు రెడీ అయ్యారు. సెప్టెంబర్ 1 నుంచి రాష్ట్రంలో రేషన్ షాపులు బంద్ చేయనున్నట్లు ప్రకటించారు. తమకు రావాల్సిన పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ డీలర్లు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం తమ సమస్యపై స్పందించకపోతే సెప్టెంబర్ 4న అసెంబ్లీని ముట్టడిస్తామని డీలర్లు హెచ్చరించారు. ఐదు నెలలుగా కమీషన్ బకాయిలు చెల్లించలేదని తెలిపారు. మరి దీనిపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.



ఒకేసారి మూడు నెలల రేషన్ పంపిణీ తర్వాత.. వచ్చే నెల అనగా సెప్టెంబర్ 1 నుంచి మళ్లీ రేషన్ పంపిణీ మొదలు కావాల్సి ఉంది. దీనికి మరో రెండు రోజులు సమయం మాత్రమే ఉండగా.. చివరి నిమిషంలో రేషన్ డీలర్లు ఊహించని షాకిచ్చారు. సెప్టెంబర్ 1 నుంచి రేషన్ షాపులు బంద్ చేస్తామని తెలిపారు. ఈ మేరకు రేషన్ డీలర్లు ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. అసలేం జరిగింది.. ఎందుకు రేషన్ డీలర్లు ఇలాంటి నిర్ణయం తీసుకున్నారంటే.. పెండింగ్ బకాయిల విడుదల కోసం రేషన్ డీలర్లు పోరు బాట పట్టారు. దీనిలో భాగంగా సెప్టెంబర్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాలు బంద్ చేస్తామని తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి రేషన్ బియ్యం పంపిణీ చేసేది లేదని తేల్చి చెప్పారు. బియ్యం పంపిణీ కమీషన్ బకాయిల విడుదల గురించి ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా లాభం లేకుండా పోతుందని.. ఈ సమస్య పరిష్కారం కోసమే తాము సెప్టెంబర్ 1 నుంచి రేషన్ షాపులు బంద్ చేయబోతున్నట్లు ప్రకటించారు. రేషన్ బియ్యం పంపిణీ బకాయిలను తక్షణమే రిలీజ్ చేయాలని కోరుతూ.. గురువారం నాడు రేషన్ డీలర్లు.. రాష్ట్ర పౌరసరఫరాల భవన్ ఎదుట నిరసన తెలిపారు. సెప్టెంబర్ 1న రేషన్ దుకాణాల బంద్ గురించి వారు ప్రకటన చేశారు. అలానే వారి ఆందోళనకు సంబంధించిన కార్యాచర ణను కూడా ఈ సందర్భంగా వెల్లడించారు. బకాయిల విడుదల విషయంలో ప్రభుత్వం స్పందించక పోతే.. సెప్టెంబర్ 4వ తేదీన రేషన్ డీలర్లంతా అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. అలానే రేషన్ బియ్యం పంపిణీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ.. ఇప్పటికే తాము అన్ని జిల్లాల కలెక్టర్లకు, సివిల్ సప్లై అధికారులకు వినతి పత్రాలు ఇచ్చామని తెలిపారు. రేషన్ బియ్యం పంపిణీకి సంబంధించి.. ప్రభుత్వం రేషన్ డీలర్లకు సుమారు ఐదు నెలల కమీషన్ బకాయిలు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టింది. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు రేషన్ బియ్యం పంపిణీకి సంబంధించి డీలర్లకు కమిషన్ బకాయిలను చెల్లించలేదు. అలానే జూన్ నెలలో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ కార్డుదారు లందరికి ఒకేసారి 3 నెలల రేషన్ బియ్యం పంపిణీ చేసిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన కమీషన్ కూడా చెల్లించలేదని డీలర్లు తెలిపారు. అంతకు ముందు రెండు నెలల కమీషన్ కూడా చెల్లించ లేదన్నారు. దీనికి సంబంధించి నెలకు రూ.25 కోట్ల చొప్పున.. 5 నెలలకు కలిపి 125 కోట్ల రూపాయల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ పెండింగ్ బకాయిలను చెల్లిస్తేనే.. వచ్చే నెల రేషన్ పంపిణీ చేస్తామని తెలిపారు. మరి ప్రభుత్వం వీరి డిమాండ్ మీద ఎలా స్పందిస్తుందో చూడాలి.

## సహస్ర హత్య కేసు నిందితుడిలో భిన్నకోణం

కూకట్‌పల్లి: సంచలనం సృష్టించిన పదేళ్ల బాలిక సహస్ర హత్య కేసులో రోజులు గడుస్తున్న కొద్ది విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. బ్యాట్ దొంగతనానికి వెళ్లిన బాలుడు.. తనను చూసిందనే కారణంతో అత్యంత దారుణంగా చిన్నారి సహస్రను హత్య చేయడం సంచలనంగా మారింది. ఈ కేసులో అనేక చిక్కుముడులు ఉన్నాయి. వాటన్నింటికి సమాధానాలు రాబట్టడం కోసం పోలీసులు నిందితుడిని కస్టడీకి ఇవ్వాల్సిందిగా కోరుతున్నారు. అలానే బాలిక హత్య జరిగిన రోజు నిందితుడు కుందేలుకు అనారోగ్యంగా ఉందని హడావుడి చేశాడని.. దాని గురించి కూడా పూర్తి వివరాలు తెలియాల్సి ఉందంటున్నారు పోలీసులు.

పదో తరగతి చదివే బాలుడు పదేళ్ల బాలికను అత్యంత దారుణం హత్య చేయడం సంచలనంగా నిలిచింది. బ్యాట్ దొంగతనం కోసం వెళ్లిన నిందితుడిని బాలిక చూడటంతో.. అతడు ఇంతటి దారుణానికి తెగించాడు. తన దగ్గర ఉన్న కత్తితో సహస్ర మీద విచక్షణారహితంగా పొడిచి హత్య చేశాడు. నేరం చేసిన తర్వాత నిందితుడు తన మీద అనుమానం రాకుండా పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు గట్టిగానే ప్రయత్నించాడు. ఎట్టకేలకు నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడిని జువైనల్ హోమ్‌కు తరలించారు. ప్రస్తుతం కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఇక పోలీసుల విచారణలో ఈ కేసుకు సంబంధించి కీలక అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. బాలుడిలోని విభిన్న కోణం పోలీసులను ఆశ్చర్యపరుస్తోంది. తాను పెంచుకుంటున్న కుందేలు మీద జాలి చూపిన నిందితుడు.. పదేళ్ల సహస్ర మీద మాత్రం విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేశాడు. నిందితుడు పెంచుకుంటున్న కుందేలు సహస్ర హత్య జరిగిన రోజే చనిపోయిందని పోలీసులు గుర్తించారు. సహస్రను హత్య చేసిన తర్వాత నిందితుడు తన కుందేలుకు అనారోగ్యంగా ఉందంటూ హడావుడి చేసినట్లు పోలీసులు వెల్లడించారు. దీనిపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఆర్థిక కష్టాల్లో ఉన్న తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టడం ఇష్టం లేకనే.. బ్యాట్ దొంగతనం చేయాలని భావించినట్లు చెప్పుకొచ్చిన నిందితుడికి.. కుందేలును పెంచడానికి మాత్రం డబ్బులు ఎక్కడ నుంచి వచ్చాయి అనే



కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. కుందేలుకు ఆరోగ్యం బాగాలేదని హడావుడి చేసిన నిందితుడు.. దాన్ని ఏ డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లాడు.. చనిపోయిన తర్వాత కుందేలును ఎక్కడ పాతిపెట్టాడు అనే ప్రశ్నలకు సమాధానాలు రాబట్టే పనిలో ఉన్నారు.

స్కూల్లో తోటి విద్యార్థులు తనను బాడీ షేమింగ్ చేసేవారని చెప్పిన నిందితుడు.. స్కూల్‌కి వెళ్లకుండ ఇంటి వద్దనే ఉంటూ.. యూట్యూబ్‌లో క్రైమ్ స్టోరీస్, వెబ్ సిరీస్‌లు చూస్తుండేవాడని విచారణలో వెల్లడించాడని పోలీసులు తెలిపారు. అయితే నిందితుడికి స్మార్ట్ ఫోన్ ఎక్కడిది.. అతడి వద్దకు ఎలా వచ్చింది.. కొనుగోలు చేస్తే.. అందుకు అవసరమైన డబ్బులు ఎవరిచ్చారు.. ఎక్కడైనా దొంగతనం చేశాడా అనే కోణంలో దర్యాప్తు చేయాలని నిర్ణయించుకున్న పోలీసులు నిందితుడిని కస్టడీకి కోరుతున్నట్లు వెల్లడించారు. విచారణలో మరిన్ని అంశాలు వెలుగులోకి వస్తాయంటున్నారు.

బాలిక తండ్రి మాట్లాడుతూ.. నిందితుడిని వదిలి పెట్టవద్దని.. అతడు మైనర్ కాదని.. క్రిమినల్ మైండ్‌తో నేరాలు చేసే అంశంలో ఆరితేరాడని.. అతడిని ఉరి తీస్తేనే.. తమ బిడ్డ సహస్ర ఆత్మకు శాంతి చేకూరుతుందని.. అలానే తమకు న్యాయం జరుగుతుందని డిమాండ్ చేశారు. అలానే నిందితుడు తల్లిదండ్రులకు కూడా దీనిలో భాగస్వామ్యం ఉందని వారు ఆరోపించిన సంగతి తెలిసిందే.



## 20 కి.మీ. మేర నిలిచిన వాహనాలు

తెలంగాణ: పలు జిల్లాలను కుండపోత వానలు అతలాకుతలం చేశాయి. గంటల తరబడి ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి చాలా ప్రాంతాలు జలదిగ్బంధంలోకి వెళ్లాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇండ్లు, పొలాలు పూర్తిగా మునిగిపోయాయి. రోడ్ల మీదకు తీవ్ర స్థాయిలో వరద నీరు చేరడంతో చాలా చోట్ల రహదారులు దారుణంగా దెబ్బతిన్నాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్లు కుంగిపోగా.. మరి కొన్ని చోట్ల కొట్టుకుపోయాయి. ఈక్రమంలో ఓ చోట రోడ్డు బాగా దెబ్బతినడంతో.. భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సుమారు 20 కిమీ మేర వాహనాలు నిలిచిపోయాయి. ఆ వివరాలు..

కామారెడ్డి జిల్లాల్లో గత రెండు రోజులుగా కురిసిన కుండపోత వానకు నేషనల్ హైవే 44 బాగా దెబ్బతిన్నది. దీంతో ఈ మార్గంలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఎంతలా అంటే.. సదాశివ నగర్ నుంచి పొందుర్తి వరకు.. సుమారు 20 కిలోమీటర్ల మేర వాహనాలు ఎక్కడివి అక్కడ నిలిపోయాయి. ఈక్రమంలో నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లే మార్గం పూర్తిగా బ్లాక్ అయింది. అలానే క్యాసంపల్లి వద్ద హైవే కుంగిపోయింది. దీంతో ఈ రూట్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

ఈక్రమంలో అధికారులు ప్రయాణికులకు కీలక అలర్ట్ జారీ చేశారు. కామారెడ్డి నుండి హైదరాబాద్ వైపు వెళ్లాల్సిన వారు తాత్కాలికంగా ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని.. లేదా వేరే మార్గాల ద్వారా హైదరాబాద్ చేరుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో కూడా హైవే ఎక్కవద్దన్నారు.

కామారెడ్డిలో రెండు రోజుల క్రితం అనగా మంగళవారం రాత్రి నుంచి మరుసటి రోజు అనగా బుధవారం సాయంత్రం వరకు కుండపోత వాన కురిసింది. గంటల తరబడి ఏమాత్రం గ్యాప్ లేకుండా వాన కురవడంతో.. కామారెడ్డిలోని వాగులు, వంకలు పొంగిపొర్లాయి. భిక్కనూర్ మండలం జంగంపల్లి వద్ద భారీ వరద వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీనికి తోడు.. రోడ్డు మధ్యలో.. సుమారు 20 అడుగుల వెడల్పుతో పెద్ద గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులు అటు వెనక్కి వెళ్లలేక, ఇటు ముందుకు కదిలే మార్గం లేక.. గంటల కొద్ది రోడ్డు మీద పడిగాపులు కాస్తు నరకం చూశారు.

నిజామాబాద్ జిల్లా, ఇందల్వాయి గేటు వద్ద భారీ వరద వల్ల.. ఎన్‌హెచ్ 44పై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. బీబీపేట-కామారెడ్డి , హైదరాబాద్-బోధన్ మార్గాల్లో.. రోడ్లు, హైలెవల్ వంతెనలు కొట్టుకుపో యాయి. ఇదిలా ఉంటే పోచారం వరద ఉద్ధృతికి మెదక్ జిల్లాలోని జాతీయ రహదారి కోతకు గురవ్వడంతో.. కామారెడ్డి-మెదక్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతం పోచారం ప్రాజెక్టు వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ఆర్మీ అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నారు.

## ఆ జిల్లాలకు వెళ్లే 98 బస్సులు రద్దు



తెలంగాణ: గత మూడు రోజులుగా తెలంగాణలో కుండపోత వానలు కురుస్తున్నాయి. మరీ ముఖ్యంగా నిజామాబాద్, ఖమ్మం, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో వానలు దంచికొట్టాయి. రోడ్లు చెరువులను తలపించాయి. ఇళ్లు, పంటపొలాలు మునిగిపో యాయి. ఇక రహదారుల పరిస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. భారీ వర్షాలు, వరదల వల్ల చాలా ప్రాంతాల్లో రోడ్లు కొట్టుకుపోయాయి. చాలా మార్గాల్లో రోడ్లను మూసివేశారు. బస్సులను రద్దు చేశారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి జిల్లాలకు వెళ్లే వారికి అధికారులు కీలక అలర్ట్ జారీ చేశారు. ఆ రెండు జిల్లాలకు వెళ్లే 98 బస్సులను రద్దు చేశారు. ప్రయాణికులకు కీలక అలర్ట్ జారీ చేశారు. హైదరాబాద్ మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ నుంచి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు వెళ్లే 98 బస్సులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీనిలో భాగంగా హైదరాబాద్ నుంచి కామారెడ్డి మీదుగా నిజామాబాద్‌కు వెళ్లే 89 బస్సులను రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు.

హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు వెళ్లే 9 ఆర్టీసీ బస్సులను కూడా అధికారులు రద్దు చేశారు. చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో కామారెడ్డిలో రెండు రోజుల్లోనే రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. ఈ కుండపోత వాన వల్ల లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. బ్రిడ్జీలు కూలిపోయాయి.. కల్వర్టులు కొట్టుకుపోయాయి. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. భారీ స్థాయిలో వరద నీరు రోడ్ల మీదకు చేరడంతో.. చాలా ప్రాంతాల్లో ఊళ్లకు ఊళ్లే జలదిగ్బంధమయ్యాయి. రోడ్లు కొట్టుకుపోయి.. వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయి.. ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. పలు ప్రాంతాల్లో గంటలకొద్దీ ట్రాఫిక్ స్తంభించిపోయింది. రాష్ట్రంలో ఈ మూడు రోజుల వ్యవధిలో కురిసిన భారీ వర్షాల వల్ల.. ఇప్పటి వరకు 794 సమస్యాత్మక రోడ్లను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. అలానే పలు జిల్లాల్లో మొత్తం 1039 కి.మీ మేర రోడ్లు దెబ్బతిన్నాయని ఆర్ అండ్ బీ శాఖ ఓ నివేదిక విడుదల చేసింది. వీటి పునరుద్ధరణకు భారీ మొత్తం ఖర్చువుతుందని అంచనా వేస్తున్నారు.



# డెబ్యూ హీరోకి విలన్‌గా డైలాగ్ కింగ్!

సూపర్‌స్టార్ కృష్ణ పెద్ద కుమారుడు రమేష్‌బాబు కొడుకు జయకృష్ణ హీరోగా ఎంట్రీ ఇస్తున్న సినిమా మీద భారీ అంచనాలు ఉన్నాయి. ఆర్ఎక్స్ 100, మంగళవారం వంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న అజయ్ భూపతి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. హీరోయిన్‌గా బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా థడాని నటిస్తోంది. ఇక విలన్ పాత్ర కోసం దర్శకుడు సీనియర్ నటుడు మంచు మోహన్‌బాబును సంప్రదించగా, ఆయన కథ విని వెంటనే ఒప్పుకున్నారని సమాచారం. ఈ వార్త నిజమైతే జయకృష్ణ తొలి సినిమా సెన్సేషనల్ కాంబినేషన్‌తో రాబోతుందనే చెప్పాలి.

సినీ ఇండస్ట్రీలో ఓ వెలుగు వెలిగి కొద్దికాలం గ్యాప్ తీసుకుని మళ్లీ రీఎంట్రీతో గుర్తింపు తెచ్చుకుంటున్నారు చాలామంది సెలబ్రెటీలు. గతంలో హీరోలుగా చేసిన వారు ఇప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్టులుగా, విలన్లుగా తమలోని మరో కోణాన్ని ఆవిష్కరిస్తున్నారు. శివాజీ, జగపతిబాబు లాంటి వారు సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ రాణిస్తూ ప్రేక్షకులతో జేజేలు కొట్టించుకుంటున్నారు. వీరి బాటలోనే కలెక్షన్ కింగ్ మోహన్‌బాబు నడుస్తున్నారు. చాలాకాలం తర్వాత 'కన్నప్ప' ద్వారా వెండితెరపై కనిపించిన ఆయన ఇప్పుడు ఓ డెబ్యూ హీరో సినిమాలో విలన్‌గా నటించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

సూపర్‌స్టార్ కృష్ణ పెద్ద కుమారుడైన రమేష్‌బాబు కొడుకు జయకృష్ణ హీరోగా ఎంట్రీ ఇవ్వబోతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి ఆర్ఎక్స్ 100, మంగళవారం వంటి హిట్ చిత్రాల ఫేమ్ అజయ్ భూపతి దర్శకత్వం వహించనున్నాడు. ఈ చిత్రంలో బాలీవుడ్ సీనియర్ హీరోయిన్ రవీనా టాండన్ కుమారెత రాషా థడాని హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రంలో విలన్‌గా సీనియర్ నటుణ్ణి తీసుకోవాలని అజయ్ భూపతి అనుకుంటున్నాడట. ఈ క్రమంలోనే మంచు మోహన్‌బాబుని ఆయన సంప్రదించారట. స్టోరీ వినగానే ఇంప్రెస్ అయిన మోహన్‌బాబు విలన్ రోల్ చేసేందుకు ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. ఈ వార్త నిజమైతే నిజంగానే సెన్సేషనల్ న్యూస్ అనే చెప్పాలి.

మోహన్‌బాబు ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో విలన్ పాత్రలు వేసిన సంగతి తెలిసిందే. ఎన్టీఆర్, ఏఎన్నార్, చిరంజీవి, మోహన్‌బాబు, నాగార్జున, వెంకటేష్ తదితర పెద్ద హీరోలకి ఆయన విలన్‌గా నటించారు. ఆ తర్వాత రూటు మార్చి హీరోగానూ ఎన్నో అద్భుతమైన చిత్రాలు తీశారు. డైలాగ్ చెప్పడంతో ఆయన చూపించే డిఫరెన్స్ ఆయన్ని డైలాగ్ కింగ్‌ని చేసింది. కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉంటోన్న మోహన్‌బాబు ఇటీవలే తన కుమారుడు మంచు విష్ణు స్వీయ నిర్మాణంలో వచ్చిన 'కన్నప్ప'లో నటించి మెప్పించారు. పాత నటులంతా సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టి రాణిస్తున్న తరుణంలో మోహన్‌బాబు కూడా మంచి కథలు వస్తే నటించడానికి సిద్ధంగా ఉన్నారట. ఈ క్రమంలోనే అజయ్ భూపతి ఆయన్ని సంప్రదించి కథ చెప్పగా చేస్తానని హామీ ఇచ్చారట. తన కుమార్తె మంచు లక్ష్మి ప్రధాన పాత్రలో నటిస్తోన్న 'దక్ష' చిత్రంలో మోహన్‌బాబు ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. నాలుగేళ్ల క్రితం ఈ చిత్రాన్ని 'అగ్ని నక్షత్రం' పేరుతో ప్రకటించగా కొన్ని అవాంతరాలతో ఆగిపోయింది. తాజాగా 'దక్ష'గా పేరు మార్చుకుని ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమైంది. తాజాగా విడుదల చేసిన టీజర్ ప్రేక్షకుల్ని బాగానే ఆకట్టుకుంటోంది. క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్‌లో రానున్న ఈ చిత్రాన్ని మంచు లక్ష్మి స్వయంగా నిర్మించడం విశేషం.

# 'స్పిరిట్' షూటింగ్ మళ్లీ వాయిదా?



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ వరుస సినిమాలతో బిజీగా ఉన్నాడు. ప్రస్తుతం 'ది రాజా సాబ్', 'ఫౌజీ' చిత్రాలతో బిజీగా ఉన్న ఆయన త్వరలోనే ' స్పిరిట్ ' యూనిట్‌తో చేరనున్నట్లు వార్తలొస్తున్నాయి. దాంతో పాటు కల్కి 2, సలార్ 2 చిత్రాలు లైన్లో ఉన్నాయి. 'ది రాజా సాబ్' డిసెంబర్ 5న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించగా ఆ చిత్రం వాయిదా పడే అవకాశాలున్నాయని తెలుస్తోంది. మరోవైపు 'ఫౌజీ' కూడా వచ్చే ఏడాది ప్రేక్షకుల మందుకు రానుంది. ఇప్పుడు ప్రభాస్ ఫ్యాన్స్‌తో పాటు అందరి ఫోకస్ సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్లో తెరకెక్కనున్న 'స్పిరిట్' పైనే ఉంది. దీనికోసం ప్రభాస్ బల్క్ డేట్స్ కేటాయించనున్నాడని తెలుస్తోంది. డార్లింగ్ తన కెరీర్లోనే తొలిసారి పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా పనిచేస్తుండటంతో ఫ్యాన్స్‌కి క్యూరియాసిటీ పెరిగిపోతోంది. పైగా ఇందులో కొరియన్ స్టార్ డాన్‌లీ విలన్‌గా నటించనున్నట్లు వార్తలొస్తున్నాయి. ఈ మూవీలో తరుణ్, మడోన్నా సెబాస్టియన్, శ్రీకాంత్ కీలక పాత్రల్లో నటించబోతున్నట్లు సమాచారం. ఇందులో ప్రభాస్‌కి తండ్రిగా మెగాస్టార్ చిరంజీవి నటించనున్నారని వార్తలొస్తున్నాయి. దీనిపై మేకర్స్ క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.

అన్నీ సక్రమంగా జరిగితే 'స్పిరిట్' షూటింగ్ ఇప్పటికే మొదలుకావాల్సి ఉండగా కానీ కొన్ని కారణాలతో వాయిదాలు పడుతూ వస్తోంది. ఇప్పటికే సందీప్ రెడ్డి వంగా ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తి చేయడంతో సెప్టెంబర్ రెండో వారం నుంచి షూటింగ్ మొదలవుతుందని వార్తలొచ్చాయి. ఆ తర్వాత అక్టోబర్ అని ప్రచారం జరిగింది. తాజాగా వినిపిస్తోన్న సమాచారం ప్రకారం.. 'స్పిరిట్' డిసెంబర్‌కి షిఫ్ట్ అయిందట. ప్రీ ప్రొడక్షన్ పనులు ఇంకా పెండింగ్‌లో ఉండటం, ప్రభాస్ ఇతర సినిమాలతో బిజీగా ఉండటంతో ఇప్పట్లో షూటింగ్ కష్టమని మేకర్స్ అనుకుంటున్నారట. ఈ నేపథ్యంలోనే డిసెంబర్ నుంచి ఈ చిత్రాన్ని సెట్స్ మీదకి తీసుకెళ్లేందుకు ప్లాన్ చేస్తున్నారట. అయితే ఎప్పుడో మొదలు కావాల్సిన ఈ సినిమా షూటింగ్ పదే పదే వాయిదా పడుతుండటంతో ఫ్యాన్స్ ఫీలవుతున్నారు.

'స్పిరిట్' మూవీలో ముందుగా దీపికా పదుకొణెని హీరోయిన్‌గా తీసుకోగా కొన్ని కారణాల చేత ఆమెను తప్పించారు. తర్వాత 'యానిమల్' బ్యూటీ త్రిప్తి దిమ్రిని తీసుకు న్నారు. ప్రభాస్ ప్రస్తుతం 'ది రాజా సాబ్' మూవీలో నటిస్తున్నాడు. ఈ చిత్రానికి సంబంధించి మారుతి కొన్ని సీన్లు రీషూట్ చేస్తుండటంతో ప్రభాస్ మళ్లీ డేట్స్ కేటాయిం చాల్సి వచ్చిందట. మరోవైపు తను 'ఫౌజీ' షూటింగులోనూ పాల్గొంటున్నాడు. ఈ రెండు సినిమాల కారణంగా ప్రభాస్ 'స్పిరిట్' మూవీకి డేట్స్ కేటాయించలేకపోతున్నాడని, అందుకే డిసెంబర్ వరకు ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలయ్యే అవకాశం లేదని తెలుస్తోంది.

# 'ఘాటి'ని టెన్షన్ పెడుతోన్న అనుష్క!



సెప్టెంబర్ 5న విడుదల కాబోతున్న ఘాటీ ప్రమోషన్లలో అనుష్క శెట్టి పాల్గొనబోరని నిర్మాత రాజీవ్ రెడ్డి స్పష్టం చేశారు. ముందే ఉన్న టర్మ్స్ ప్రకారం ఆమె ప్రీ రిలీజ్ ఈవెంట్ లేదా వీడియో ఇంటర్వ్యూల్లో కనిపించే అవకాశం లేదన్నారు. మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి టైంలో నవీన్ పోలిశెట్టి ఒంటరిగా ప్రమోషన్లను మోయగా, ఘాటీలో హీరో విక్రమ్ ప్రభు తెలుగు ప్రేక్షకుల్లో పెద్దగా పాపులర్ కాకపోవడం వల్ల ఆ లోటు మరింత స్పష్టమవుతుందని అంటున్నారు. దీంతో ప్రమోషన్ల భారమంతా డైరెక్టర్ క్రిష్ మీదే పడింది. తెలుగులో స్టార్ హీరోయిన్ హోదా అనుభవించిన అనుష్క శెట్టి అలియాస్ స్వీటీ ఈ మధ్యకాలంలో సినిమాలు తగ్గించేసిన సంగతి తెలిసిందే. కెరీర్ పీక్స్‌లో ఉన్న సమయంలో 'సైజ్ జీరో' చిత్రం కోసం బరువు పెరగడం ఆమెకు మైనస్ అయింది. ఎంత ప్రయత్నించినా చాలాకాలం బరువు తగ్గలేకపోవడంతో చాలా అవకాశాలు కోల్పోయింది. ఈ క్రమంలోనే చూస్తూ చూస్తూ వయసు 40ప్లస్ దాటేయడంతో సన్నగా అయినా మేకర్స్ ఆమెకు ఛాన్సులు ఇవ్వలేదు. ఇటీవల 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' ఓ మోస్తరు హిట్ అందుకున్న అనుష్క తాజాగా ' ఘాటి 'తో మంచి కమ్‌బ్యాక్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తోంది. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో అనుష్క గిరిజన మహిళగా పవర్‌ఫుల్ రోల్‌లో నటిస్తోంది. యూవీ క్రియేషన్స్ బ్యానర్ నిర్మించిన ఈ చిత్రం ఎన్నో వాయిదాల తర్వాత సెప్టెంబర్ 5న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమైంది. గతంలో క్రిష్, అనుష్క కాంబినేషన్లో వచ్చిన 'వేదం' హిట్ కావడంతో 'ఘాటి'పై మంచి అంచనాలు నెలకొన్నాయి.

సినిమా రిలీజ్‌కి ఇంకా వారం రోజులే ఉండటంతో యూనిట్ ప్రమోషన్ల జోరు పెంచింది. అయితే ఈ ప్రమోషన్లో అనుష్క ఎక్కడా కనిపించడం లేదు. దీంతో ఆమె ఎక్కడని ఫ్యాన్స్ ప్రశ్నిస్తున్నారు. అయితే సినిమాకి సైన్ చేసినప్పుడే ప్రమోషన్స్‌కి రానని అనుష్క చెప్పినట్లుగా తెలుస్తోంది. ఈ విషయాన్ని ఓ ఇంటర్వ్యూలో నిర్మాతల్లో ఒకరైన రాజీవ్ రెడ్డి తెలిపారు. గతంలో 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' సినిమా విషయంలోనూ అనుష్క ఇలాగే చేసింది. అందుకే నవీన్ పోలిశెట్టి ఒక్కడే ప్రమోషన్లు చేసుకున్నాడు. 'ఘాటి' చిత్రానికి అనుష్క, క్రిష్ మాత్రమే అట్రాక్షన్‌గా నిలుస్తున్నారు. ఇందులో హీరోగా నటించిన విక్రమ్ ప్రభుకి తెలుగులో అస్సలు క్రేజ్ లేదు. దీంతో ఇప్పుడు ప్రమోషన్ల భారమంతా డైరెక్టర్ క్రిష్‌పైనే పడింది. 'ఘాటి' కంటెంట్ పరంగా అందరినీ ఆకట్టుకుంటోంది. అనుష్క మరీ వైలెంట్‌గా కనిపిస్తుండటంతో సినిమా విషయం ఉందని ప్రేక్షకులు అనుకుంటున్నారు. ఫస్ట్ డే పాజిటివ్ టాక్ వచ్చిందంటే చాటు సినిమాని ఎవ్వరూ ఆపలేరనే చెప్పాలి.

# హీరోగా సెన్సేషనల్ డైరెక్టర్..



'టూరిస్ట్ ఫ్యామిలీ'తో సంచలనం సృష్టించిన దర్శకుడు అభిషన్ జీవింత్.. ఇప్పుడు హీరోగా మారుతున్నారు. మదన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వినాయక చవితి సందర్భంగా అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. ఇందులో మలయాళ బ్యూటీ హీరోయిన్‌గా నటించనున్నారు. గతంలో అనేక మంది తమిళ దర్శకులు బిగ్ స్క్రీన్ మీద యాక్టర్స్ గా రాణించారు. మరి అభిషన్ జీవింత్ హీరోగా ఏ మేరకు ఆకట్టుకుంటాడో, ఈ సినిమా ఎలాంటి అనుభవాన్ని మిగులుస్తుందో వేచి చూడాలి. టూరిస్ట్ ఫ్యామిలీ ' సినిమాతో టాక్ ఆఫ్ ది సౌత్ ఇండస్ట్రీగా మారిన డైరెక్టర్ అభిషన్ జీవింత్. మానవ సంబంధాలను అద్భుతంగా తెరకెక్కించి బాక్సాఫీస్ దగ్గర ఘన విజయం సాధించాడు. డెబ్యూతోనే సంచలనం సృష్టించిన ఈ దర్శకుడు.. సూపర్ సార్ రజనీకాంత్, ఎస్.ఎస్ రాజమౌళి లాంటి దిగ్గజాల నుంచి ప్రశంసలు అందుకున్నారు. దీంతో అభిషన్ ఈసారి ఎలాంటి సినిమాతో వస్తాడో అని ఆడియన్స్ ఎదురు చూస్తున్నారు. అయితే ఈ కుర్ర డైరెక్టర్ మెగాఫోన్ పక్కన పెట్టి, కెమెరా ముందుకు రావాలని నిర్ణయించుకున్నాడు. హీరోగా ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అయ్యాడు. అభిషన్ జీవింత్ హీరోగా తెరంగేట్రం చేయనున్నాడని ఎన్నో రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఇదే విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. రజనీకాంత్ కూతురు సౌందర్య రజనీకాంత్ ప్రొడక్షన్ లో అభిషన్ హీరోగా పరిచయం కాబోతున్నారు. ఇందులో 'రేఖాచిత్రం' ఫేమ్ అనశ్వర రాజన్ హీరోయిన్ గా నటించనుంది. "ఈ ఏడాది 'టూరిస్ట్ ఫ్యామిలీ' వంటి బ్లాక్ బస్టర్ మూవీని టీకెక్కించిన డైరెక్టర్ అభిషన్ జీవింత్ ను పవర్ ఫుల్ న్యూ అవతార్ లో ఆవిష్కరించబోతున్నాం. మలయాళ చిత్ర పరిశ్రమలో వరుస విజయాలను అందుకుంటున్న టాలెంటెడ్ యాక్ట్రెస్ అనశ్వర రాజన్ ఈ చిత్రంలో హీరోయిన్ గా నటిస్తున్నారని ప్రకటించడానికి మేము సంతోస్తున్నాం" అని చిత్ర యూనిట్ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. ఈ సందర్భంగా సాంకేతిక నిపుణల వివరాలను కూడా వెల్లడించారు.

# చిన్నవాడైనా శిరస్సు వంచి దండం పెడుతున్నా

'హనుమాన్' హీరో తేజ సజ్జా, మంచు మనోజ్ ప్రధాన పాత్రల్లో నటించిన పాన్ ఇండియా సినిమా 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్ గా నటించగా.. శ్రియ, జగపతి బాబు, జయరామ్ కీలక పాత్రలు పోషించారు. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ లో రూపొందిన ఈ సినిమా సెప్టెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రమోషన్స్ లో భాగంగా తాజాగా ట్రైలర్ ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఈవెంట్ లో తేజ సజ్జా, మంచు మనోజ్, శ్రియతో పాటుగా దర్శక నిర్మాతలు పాల్గొన్నారు.

మంచు మనోజ్ మాట్లాడుతూ.. "ఈరోజు ఈ స్టేజ్ మీద నిలబడటం వెనుక మూడు సంవత్సరాల కృషి ఉంది. ఎన్నో కలలు.. ఎన్నో ఆశలు పెట్టుకొని 'మిరాయ్' జర్నీ స్టార్ట్ చేశాం. మూడేళ్ల క్రితం తమ్ముడు తేజ కాల్ చేసి, ఒక సినిమా అనుకుంటున్నామని కార్తిక్ తో కలిసి నా దగ్గరకు వచ్చి కథ చెప్పాడు. బ్లాక్ స్వార్డ్ గా చేయాలని నన్ను అడిగారు. ఆ బ్లాక్ స్వార్డ్ ఇప్పుడు 2.0 లాగా వచ్చేసాడు. ఒక మంచి స్క్రిప్ట్ తో నేను ఆ పాత్ర చేయగలనని నన్ను వెతుక్కుంటూ వచ్చిన తేజ, కార్తీక్ కి థ్యాంక్స్. 'హనుమాన్' లాంటి ఒక నేషనల్ సూపర్ డూపర్ హిట్ ఇచ్చిన తర్వాత ఎవరైనా వెంట వెంటనే సినిమాలు సైన్ చేద్దాం, నాలుగు డబ్బులు వెనకాల వేసేసుకుందాం అనే మైండ్ సెట్ లో ఉంటారు. దాంట్లో తప్పులేదు. తేజ ఎంతో కష్టపడి వచ్చాడు. కానీ హనుమాన్ తర్వాత మూడేళ్లు ఆగి ఈ సినిమాతో వస్తున్నాడంటే అతని డెడికేషన్ ఏంటో అర్థమవుతుంది" అని అన్నారు.



"డైరెక్టర్ కార్తీక్ నాకు ఎమోషన్. అతని టాలెంట్ ముందు ఎవరైనా చిన్నబోతారు. నాకు సినిమా గురించి కొంత తెలుసు అనుకున్నాను. కానీ ఆయన్ను కలిసాక తెలిసింది నాకు సినిమా గురించి ఏమీ తెలియదని. మళ్ళీ ఫస్ట్ కి వెళ్ళిపోయి సినిమా గురించి నేర్చుకుంటున్నాను. అంత బ్రిలియంట్ డైరెక్టర్ అతను. ఆరేడేళ్ల క్రితం రాసుకున్న కథ. అశోకుడు తొమ్మిది పుస్తకాల గురించి చెప్పాలి.. మన హిస్టరీని ఎలాగైనా ముందుకి తీసుకెళ్ళాలనేది కార్తీక్ విజన్. సినిమా చాలా బాగా తీశాడు. హాలీవుడ్ స్టైల్ లో, ఇంటర్నేషనల్ స్టైల్ లో సినిమా తీయాలని అందరికీ ఆశ ఉంటుంది. ఆయనే డైరెక్టర్ గా డీఓపీగా చేయడం అంత ఈజీ కాదు. హ్యాట్సాఫ్ కార్తీక్. వయసులో చిన్నవాడైనా శిరస్సు వంచి దండం పెడుతున్నాను. అతని గురించి ఎంత చెప్పినా తక్కువే. ఎన్నో ఆటు పోట్లు ఎదుర్కొని ఇక్కడిదాకా వచ్చారు. ఈ సినిమాలో నాకు అవకాశం ఇచ్చినందుకు థ్యాంక్స్"అని మంచు మనోజ్ అన్నారు.

# ఎలాంటి తప్పు చేయలేదు..

ఐటీ నిపుణుడిని కిడ్నాప్ చేసిన దాడి చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోసం కేరళ హైకోర్టును ఆశ్రయించిన నటి లక్ష్మీ మీనన్‌కు అరెస్టు నుంచి తాత్కాలిక రక్షణ లభించింది. జస్టిస్ బెచు కురియన్ థామస్ నేతృత్వంలోని కోర్టు సెప్టెంబర్ 17 వరకు ఆమెను అరెస్ట్ చేయరాదని ఆదేశించింది. కొచ్చిలోని ఒక పబ్‌లో జరిగిన వాదన ఈ సంఘటనకు కారణమని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. అయితే లక్ష్మీ మీనన్ ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తూ, కేసు తన ప్రతిష్టను దెబ్బతీసే ఉద్దేశ్యంతో సృష్టించబడిందని తెలిపారు.

మలయాళ నటి లక్ష్మీ మీనన్ పై కిడ్నాప్ కేసు నమోదు కావడం కలకలం రేపుతోంది. కొచ్చిలో ఓ ఐటీ ఉద్యోగిని కిడ్నాప్ చేసి దాడి చేశారన్న ఆరోపణలతో లక్ష్మీతో పాటు ఆమె స్నేహితులపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి ముగ్గురిని అరెస్ట్ చేయగా.. లక్ష్మీ మీనన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అయితే ఆమె పేరును ఇంకా ఎఫ్ఐఆర్‌లో చేర్చలేదని కొచ్చి నగర పోలీస్ కమిషనల్ విమలాదిత్య తెలిపారు. మరోవైపు తనను పోలీసులు అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ కోసం లక్ష్మీ మీనన్ కేరళ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ బెచు కురియన్ థామస్ నేతృత్వంలో ధర్మాసనం సెప్టెంబర్ 17 వరకు ఆమెను అరెస్ట్ చేయరాదని ఆదేశాలు జారీచేసింది.



పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొచ్చిలోని వెలాసిటీ అనే పబ్‌లో లక్ష్మీ మీనన్, ఐటీ ఉద్యోగి మధ్య వివాదం తలెత్తింది. ఇద్దరూ కాసేపు వాదులాడుకున్న తర్వాత ఐటీ ఉద్యోగి వెళ్లిపోగా లక్ష్మీమీనన్ తన స్నేహితులతో కలిసి అతడిని కారులో వెంబడించింది. అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో నార్త్ రైల్వే బ్రిడ్జి దగ్గర కారును అడ్డగించి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని లక్ష్మీ మీనన్ బ్యాచ్ బలవంతంగా తమ కారులోకి ఎక్కించుకున్నారు. కారులోనే అతడిపై దాడికి పాల్పడి అలువా-పరపూర్ జంక్షన్ వద్ద వదిలేసి వెళ్లిపోయారు. దీంతో బాధితుడు అక్కడి నుంచి నేరుగా పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఐటీ ఉద్యోగిని కారులో తీసుకెళ్తోన్న దృశ్యాలు సీసీటీవీ కెమెరాలో రికార్డు కావడంతో పోలీసులు వాటిని సేకరించి నిందితుల్ని అరెస్ట్ చేశారు. లక్ష్మీమీనన్ పరారీలో ఉండటంతో ఆమె గురించి గాలింపు చేపట్టారు.



# విజువల్ వండర్‌గా 'మిరాయ్' ట్రైలర్..

తేజ సజ్జా హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'మిరాయ్' ట్రైలర్ విడుదలైంది. రితికా నాయక్ హీరోయిన్ గా నటిస్తుండగా, మంచు మనోజ్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా, విజువల్ వండర్ లా ఉంది. అత్యాధునిక వీఎఫ్ఎక్స్, నేపథ్య సంగీతం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

తేజ సజ్జా హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో ఈ పాన్ ఇండియా మూవీ తెరకెక్కుతోంది. ఇందులో రితికా నాయక్ హీరోయిన్ గా నటిస్తుండగా.. మంచు మనోజ్ విలన్ పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ జనాలను ఆకట్టుకుంది. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. "ఈ ప్రమాదం ప్రతీ గంధాన్ని చేరబోతోంది" అనే వాయిస్ తో ప్రారంభమైన ఈ ట్రైలర్ విజువల్ వండర్ లా ఉంది. దాదాపు 3 నిమిషాలతో ఈ వీడియోని కట్ చేశారు. వీఎఫ్ఎక్స్ నెక్స్ట్ లెవల్ లో ఉన్నాయి. బ్యాగ్రౌండ్ స్కోర్ బాగుంది. సెప్టెంబర్ 12న ప్రపంచ వ్యాప్తంగా ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ లో నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ భారీ బడ్జెట్ తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'మిరాయ్' మూవీ సెప్టెంబర్ 12న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,